

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

కర్నూలు

: fb.com/vaartha Digital

Published from Kurnool, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

20-3-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 48 పేజీలు: 10+4 వెల: 6.50


## రూపాయి ఢమాల్

ఆల్‌టైం కనిష్టానికి మారకం విలువ

## హెచ్‌డిఎఫ్‌సి ఛైర్మన్ రాజీనామా

బ్యాంకు షేర్లు భారీగా పతనం

వాణిజ్యం పేజీలో

## భారత్‌పై పెనుప్రభావం

ఇరాన్‌లోని సౌత్ పార్స్ గ్యాస్ క్షేత్రంపై దాడి భారత్‌లో గ్యాస్ ధరలపై ప్రత్యక్షంగా ప్రభావం చూపనుంది. అటు ఇరాన్ దాడులతో ప్రపంచంలోనే అతిపెద్ద ద్రవీకృత సహజవాయువు (ఎల్ఎన్‌జి) ఉత్పత్తి సంస్థలు ఖతార్ ఎనర్జీకి చెందిన రాస్ లఫాన్, మెసాయిద్ ప్లాంట్లలో తాత్కాలికంగా ఉత్పత్తి నిలిపివేసింది. ఇది ప్రపంచ ఎల్ఎన్‌జి సరఫరాలలో సుమారు 20 శాతాన్ని ప్రభావితం చేసింది. భారత్ తన ఎల్ఎన్‌జి అవసరాల కోసం ఖతార్‌పై ఎక్కువగా ఆధాపడింది. ఖతార్‌లో ఉత్పత్తి నిలిచిపోవడం, హార్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతలు సరఫరా గొలుసుకు అంతరాయం కలిగిస్తున్నాయి. ఎల్‌పిజిలో 80-85శాతం గల్ఫ్ దేశాల నుంచి వస్తుంది. చమురు, గ్యాస్ కేంద్రాలపై దాడులు కొనసాగితే భారత్‌లో చమురు, గ్యాస్ సంక్షోభం మరింత తీవ్రమయ్యే అవకాశాలున్నాయి.


## దాడులు ఆపాలి

ఇరాన్‌కు 12 దేశాల అల్టిమేటం

రియాద్‌లో అరబ్, ఇస్లామిక్ దేశాల విదేశాంగ మంత్రుల భేటీ



గురువారం ఇజ్రాయెల్ దాడితో దగ్ధమవుతున్న ఇరాన్‌లోని సౌత్ పార్స్ గ్యాస్ క్షేత్రం



# ఇంధన సంక్షోభం

## రంగంలోకి మోడీ

ప్రపంచ దేశాధి నేతలకు ప్రధాని ఫోన్

మధ్యప్రాచ్యంలో పరిస్థితులపై చర్చలు

తక్షణమే శాంతి నెలకొనేలా చూడాలని నిర్ణయం

## అది తప్పే!

సౌత్ పార్స్ గ్యాస్ ఫీల్డ్‌పై ఇజ్రాయెల్ దాడి సమంజసం కాదు

ఖతార్ చమురు హబ్‌పై ఇరాన్ క్షిపణుల దాడి తప్పే

మళ్లీ టెహ్రాన్ దాడి చేస్తే మేమే బరిలోకి దిగుతాం: ట్రంప్ హెచ్చరిక

ఇరాన్ చమురు క్షేత్రాలపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు

ప్రతిగా గల్ఫ్ దేశాలపై ఇరాన్ క్షిపణుల ప్రయోగం

ప్రపంచంలోనే అతిపెద్ద చమురుక్షేత్రం ధ్వంసం

ఇరాన్‌పై సైనికచర్యకు దిగుతాం: సౌదీ హెచ్చరిక

ఇంధన యుద్ధం దిశగా పశ్చిమాసియా

ప్రపంచ దేశాలు ఆందోళన

5

గల్ఫ్ దేశాల్లో చమురు కేంద్రాలు, గ్యాస్ క్షేత్రాలపై దాడులతో ఇంధన సంక్షోభం ముంచుకొస్తోంది. అంతర్జాతీయ విపణిలో చమురు గ్యాస్ ధరలు భగ్గుమన్నాయి. బ్యారెల్ ముడి చమురు 125 డాలర్లకు చేరింది. గ్యాస్ ధరలు ఆకాశాన్నంటాయి. ప్రపంచ ఎనర్జీ సరఫరాకు వెన్నెముక లాంటిదిగా భావించే చమురు క్షేత్రాల్లో మంటలు చెలరేగడం ఆందోళనలను మరింత పెంచింది. సౌత్ పార్స్- నార్త్ డోమ్ రిజర్వాయర్ ప్రపంచంలోనే అతిపెద్ద గ్యాస్ నిల్వగా గుర్తించబడింది. ఇందులో ఖతార్ కూడా భాగస్వామి. ఖతార్ ఈ ఫీల్డ్ నుంచే పెద్ద ఎత్తున ఎల్ఎన్‌జి ఉత్పత్తి చేసి ప్రపంచానికి ఎగుమతి చేస్తుంది. ఇక్కడ ఏ చిన్న అంతరాయం వచ్చినా గ్లోబల్ ఎనర్జీ మార్కెట్‌పై నేరుగా ప్రభావం పడుతుంది.



## మార్కెట్‌కు చమురు మంటలు

సెన్సెక్స్ 2497 పాయింట్లు, నిఫ్టీ 778 పాయింట్లు పతనం

రూ.13 లక్షల కోట్లు మదుపరుల సంపద ఆవిరి

## సముద్ర కేబుళ్లు కత్తిరిస్తాం

ప్రపంచదేశాల ఆర్థిక మూలాలే లక్ష్యం

హౌతీలు హెచ్చరిక



## పేదలకు ఆపన్న హస్తం

సిఎంఆర్ఎఫ్ దస్త్రంపై సిఎం చంద్రబాబు సంతకం

6,787 మందికి రూ. 55.63 కోట్లు

**విజయవాడ మార్చి 18, ప్రభాతవార్త ప్రతినిధి:** తెలుగు నూతన సంవత్సరం తొలి రోజున పేదల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తూ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు మొద టిసంతకం చేశారు. గురువారం ఉగాది పర్వదినాన ముఖ్యమంత్రి సహాయ నిధి దస్త్రంపై తొలి సం తకం చేశారు. 6,787 మందికి లబ్ధి కలిగేలా రూ.55.63 కోట్ల ఆర్థిక సాయం విడుదలకు సీఎం ఆమోదం తెలుపుతూ సంతకంచేశారు.ఆర్థికఇబ్బందులు ఎదుర్కొ ంటున్న పేద కుటుంబా లకుఈ సాయం ఎంతో ఉపశమనం >>2

## ప్రపంచంలోనే అగ్రగామిగా తెలుగు..

# ఇది ఉగాది సంకల్పం

అమరావతి దేవతల రాజధాని అవ్వాలని కోరుకున్నా..

స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలతో రాష్ట్రాభివృద్ధి

శ్రీ పరాభవ నామ సంవత్సరంలో అందరికీ మంచి జరగాలి

ఉగాది వేడుకల్లో సిఎం చంద్రబాబు



సిఎం సహాయనిధి దస్త్రంపై సంతకం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

**విజయవాడ, మార్చి 19,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచంలోనే తెలుగు జాతి అగ్రగామిగా ఉండేలా 2047కి ఈ ఉగాదికి సంకల్పం తీసుకుందామని సీఎం చంద్రబాబు ప్రజలకు పిలుపునిచ్చారు. సంకల్పాన్ని నెరవేర్చేందుకు అంకితభావంతో పనిచేద్దామన్నారు.కచ్చితంగా అది జరిగితీరుతుందన్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో మంత్రులు కందుల దుర్గేష్, ఆనం రామనారాయణరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి సీఎం పాల్గొన్నారు. అవధాని మాడుగుల నాగఫణిశర్మ ఉగాది పంచాంగ శ్రవణం చేశారు. భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికే ఆదర్శమన్న చంద్రబాబు విలువలకు కట్టుబడి పనిచేద్దామన్నారు.పెద్ద కుటుంబం సుఖసంతోషాలకు నాందన్న సీఎం చిన్న కుటుంబం సమస్యలకు నెలవుగా మారిందన్నారు. గోదావరి పుష్కరాల కన్నా పోలవరాన్ని పూర్తి చేస్తామని తర్వాత నదుల అనుసంధానాన్ని చేపడతామన్నారు. అమరావతిని అద్భుతమైన రాజధానిగా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రతి ఉగాదికి జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నిర్దేసిత సమయంలో ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. అనంతరం ఉగాది పురస్కారాలకు ఎంపికైన వారికి అవార్డులను అందజేశారు. రాష్ట్రంలోని ప్రతీ వ్యక్తికి ఆర్థిక,సామాజిక, ఆరోగ్య భద్రత అందించాలన్నదే కూటమి >>2

## 6 జిల్లాల్లో అకాల వర్షాలు

పంట నష్టాన్ని లెక్కించాలని అధికారులకు సిఎం ఆదేశాలు

రైతుకు పూర్తిసాయం అందిస్తాం: మంత్రి అచ్చెంన్నాయుడు

2



## 10,060 ఉద్యోగాల భర్తీకి

# జాబ్ క్యాలెండర్

నోటిఫికేషన్ తేదీల ప్రకటన

మాట నిలబెట్టుకున్నా.. పోటీ పరీక్షలకు సిద్ధం కండి: విద్యాశాఖ మంత్రి లోకేష్

**విజయవాడ,.మార్చి19,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ యువత ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న జాబ్ క్యాలెండర్ వచ్చేసింది. రాష్ట్ర యువతకు ఉగాది కానుకగా ఉద్యోగాల పండగ ప్రకటిస్తున్నామంటూ 10,060 ఉద్యోగాల భర్తీకి విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేశ్ జాబ్ క్యాలెండర్ విడుదల చేశారు. ఇక నుంచి ప్రతి ఉగాదికి జాబ్ కేలండర్ విడుదల చేయనున్నట్లు మంత్రి లోకేశ్ ప్రకటించారు. జాబ్ కేలండర్‌లోని పోస్టులతో పాటు వాటి భర్తీకి ఎప్పుడు నోటిఫికేషన్ విడుదల చేయనున్నారో ముందుగా ప్రకటించారు. మొదట ఉన్నత విద్యాశాఖలో 1,500 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల కానుంది. విశ్వవిద్యాలయాల్లో అధ్యాపక పోస్టుల భర్తీకి ఈ ప్రకటన మే 15వ తేదీన వెలువడనుంది. 91 గ్రూపు1 పోస్టులకు, హోం శాఖలో 2,778 పోస్టులకు, ఇతర శాఖల్లో 928 పోస్టులకు ఆగస్టు 15వ తేదీన నోటిఫికేషన్ జారీ అవుతుంది. 750 గ్రూపు2 పోస్టులకు, 503 ఏఈఈ పోస్టులకు, ఇతరత్రా 506 పోస్టులకు సెప్టెంబరు 15న నోటిఫికేషన్ విడుదల చేస్తారు. పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యకు చెందిన 3,004 పోస్టులకు అక్టోబరు 15న నోటిఫికేషన్ జారీ కానుంది. గత ఏడాది 16 వేల డీఎస్సీ పోస్టులను కూటమి ప్రభుత్వం భర్తీ చేసింది. యువగళం పాదయాత్రలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ఇచ్చిన హామీని ప్రజా ప్రభుత్వం నెరవేర్చడం పట్ల మంత్రి లోకేశ్ సంతోషం వ్యక్తం చేశారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో 10,060 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఏ తేదీని వస్తాయో, ఎన్ని పోస్టులు భర్తీ చేస్తామో ప్రకటిస్తూ జాబ్ క్యాలెండర్ విడుదల చేశామని వెల్లడించారు. నిర్దేశిత సమయంలోనే పరీక్షలు నిర్వహించి ప్రకటించిన అన్ని పోస్టులు భర్తీ చేస్తామని స్పష్టం చేశారు. సిలబస్ కూడా ముందుగానే ప్రకటిస్తామన్న మంత్రి లోకేశ్ ఉద్యోగార్థులందరూ నైపుణ్యం పోర్టల్‌లో వన్ టైం రిజిస్ట్రేషన్ చేసుకొని అలర్ట్స్ పొందవచ్చని సూచించారు.యువగళం పాదయాత్రలో ఇచ్చిన తన మాట తాను నిలబెట్టుకున్నానన్న లోకేశ్ ప్రజా ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేసిందని వెల్లడించారు. ఇక నిరుద్యోగులు పోటీపరీక్షలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇకపై ఏటా ఉగాదికి ఉద్యోగాల ప్రకటన పండగ ఉంటుందని స్పష్టం చేశారు. ఇక యువత పోటీ పరీక్షలకు సిద్ధం అవ్వండని సూచించారు. ఉద్యోగార్థులు అందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపిన మంత్రి ఇతరత్రా వివరాలు "నైపుణ్యం" వెబ్‌లోతెలుసుకోవచ్చని మంత్రి లోకేశ్ అన్నారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగాలు ఇస్తుందని యువతకు హామీ ఇచ్చింది.. >>2



తాడేపల్లిలో ఉగాది వేడుకల్లో వచ్చడిని స్వీకరిస్తున్న వైఎస్ జగన్

## మార్పు ఖాయం!


చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలే

3

ఉగాది వేడుకల్లో మాజీ సిఎం జగన్

## ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో

# 3 ఏకలవ్య విద్యాలయాలు



నెల్లూరులో జరిగిన కార్యక్రమంలో జాతీయ షెడ్యూల్డ్ ట్రైబ్స్ కమిషన్ చైర్మన్ అంతర్ సింగ్

గిరిజనులు, ఆదివాసీల సమస్యలను పరిష్కరించడమే ప్రధాన లక్ష్యం

యానాదుల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం

జాతీయ షెడ్యూల్డ్ ట్రైబ్స్ కమిషన్ చైర్మన్ అంతర్ సింగ్ ఆర్య

**నెల్లూరు కలెక్టరేట్, మార్చి 19, ప్రభాతవార్త:** గిరిజనులు, ఆదివాసీల సమస్యలను సంపూర్ణంగా పరిష్క రించడమే ప్రధాన లక్ష్యమని జాతీ య షెడ్యూల్డ్ ట్రైబ్స్ కమిషన్ చైర్మన్ అంతర్ సింగ్ ఆర్య స్పష్టం చేశారు. ఈ దిశగా దేశవ్యాప్తంగా పర్యటిస్తూ గిరిజనుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, వారి అభ్యున్నతికి అవసరమైన చర్యలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. గురువారం సాయంత్రం నెల్లూరు నగరానికి విచ్చేసిన కమిషన్ చైర్మన్‌కు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, కాకర్ల సురేష్, ఎస్పీ డా.అజితా వెజండ్ల, జాయింట్‌కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు తదితరులు ఘన స్వాగతం పలికారు. గిరిజన సంఘాల నాయకులు, గిరిజనులు కూడా ఆత్మీయంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. జిల్లాలో గిరిజనులకు అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు.యానాదుల సంక్షేమానికి చేపట్టిన కార్యక్రమాలను ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్ రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా జాతీయ ఎస్టీకమిషన్ చైర్మన్ అంతర్‌సింగ్ మాట్లాడుతూ గిరిజనులకు విద్య, ఆరోగ్యం రంగాల్లో ప్రత్యేకప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మూడు ఏకలవ్య విద్యాలయాల స్థాపనకు కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసినట్లు చెప్పారు. గిరిజన సమస్యలను ఒకే ఈమెయిల్ ద్వారా తమదృష్టికి తీసుకువస్తే తప్పకుండా >>2



5

గురువారం చిరంజీవికి అవార్డు అందజేస్తున్న సిఎం రేవంత్

## మెగాస్టార్ చిరుకు ఎన్టీఆర్ అవార్డు

ఘనంగా తెలంగాణ గద్దర్ పురస్కారాలు ప్రదానం




లక్నోలోని విధాన భవన్ వెలుపల గ్యాస్ కొరతపై గురువారం నిరసన తెలుపుతున్న సమాజ్‌వాదీ పార్టీ నాయకులు, కార్యకర్తలు

# 6 జిల్లాల్లో అకాల వర్షాలు

## పంట నష్టాన్ని లెక్కించాలని అధికారులకు సిఎం ఆదేశాలు

### రైతుకు పూర్తిసాయం అందిస్తాం: మంత్రి అచ్చెంన్నాయుడు

**విజయవాడ, మార్చి 19, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాలు, వడగళ్ల వానలతో వ్యవసాయ పంటలకు జరిగిన నష్టంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు గాలివానలు, వర్షాలు, వడగళ్లత కారణంగా దెబ్బతిన్న పంట నష్టం వివరాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా కృష్ణా, నెల్లూరు, శ్రీ సత్యసాయి, ఎన్టీఆర్, అనంతపురం, పార్వతీపురం మన్యం జిల్లాలకు సంబంధించి 16 మండలాల్లోని 89 గ్రామాల్లో పంటలు వర్షాలతో దెబ్బతిన్నట్టు అధికారులు ప్రాథమిక అంచనాలను ముఖ్యమంత్రికి వివరించారు. 384 హెక్టార్లలో వరి, 630 హెక్టార్లలో మొక్కజొన్న, 200 హెక్టార్లలో మినుము వంటి పంటలకు నష్టం వాటిల్లినట్టు తెలిపారు. మొత్తం 1,215 హెక్టార్లలో సాధారణ పంటలు దెబ్బతినగా, 2,043 మంది రైతులు నష్టపోయినట్టు చెప్పారు. అలాగే అనంతపురం, శ్రీసత్యసాయి, ఎన్టీఆర్ జిల్లాల్లోని ఉద్యాన పంటలపైనా అకాల వర్షాలు తీవ్ర ప్రభావం చూపాయని... మొత్తం 307 మంది రైతులకు చెందిన 267 హెక్టార్లలోని అరటి, బొప్పాయి, మామిడి, ఆరెంజ్ తదితర పంటలకు నష్టం వాటిల్లినట్టు ముఖ్యమంత్రికి అధికారులు తెలిపారు. అయితే పూర్తిస్థాయిలో పంట నష్టం వివరాలు సేకరించాలని చెప్పారు. అలాగే వాతావరణ పరిస్థితులపై ఎప్పటికప్పుడు రైతులకు సమాచారం ఇస్తూ... అప్రమత్తం చేయాలన్నారు. తద్వారా పంట నష్టం తగ్గించగలిగేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

**రైతులకు పూర్తి సహాయం అందిస్తాం: మంత్రి అచ్చెన్నాయుడు**

రాష్ట్రంలో రాబోయే మూడు, నాలుగు రోజుల పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు (గంటకు 30-40 కి.మీ వేగంతో) వడగళ్లతో కూడిన అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గురువారం అత్యవసర సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ శాఖ ఇంచార్జ్ కమిషనర్, ఉద్యానవన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు, ఇతర ఉన్నతాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని సమీక్షి ంచారు. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం/ద్రోణి ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయని, ముఖ్యంగా రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర జిల్లాల్లో తీవ్ర ప్రభావం ఉండే అవకాశముందని మంత్రి తెలిపారు. అరటి, మామిడి, మిర్చి, మొక్కజొన్న వంటి పంటలకు నష్టం కలిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను త్వరితగతిన గుర్తించి, నష్టాన్ని నమోదు చేయాలని సంబంధిత అధికారులకు మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయం అందిస్తుందని హామీ ఇచ్చారు. రైతులకు సూచనలు: పండిన పంటలను సాధ్యమైనంత త్వరగా సేకరించి భద్రపరచాలి. వడగళ్ల వాన, ఈదురుగాలుల సమయంలో పొలాల్లో ఉండకూడదు. వ్యవసాయ యంత్రాలు, పరికరాలను సురకత ప్రదేశాల్లో ఉంచాలి.

అకాల వర్షాలతో కొంతమేర ఉష్ణోగ్రతలు తగ్గి ప్రజలకు ఉపశమనం లభించినప్పటికీ, పంటలు, ఆస్తులకు నష్టం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి, నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

# యువతకు ప్రభుత్వం ఉగాదికి తీపి కబురు చెప్పింది

## డి.సిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ,మార్చి19,ప్రభాతవార్తప్రతినిధి:** ఉగాది పర్వదినాన రాష్ట్ర యువతకు తమ కూటమి ప్రభుత్వం తీయటి కబురు చెప్పిందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. 10,060 ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీకి జాబ్ క్యాలెండర్ విడుదల చేశామని ప్రస్తావించారు. ఈమేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ట్వీట్ పెట్టారు. నిర్దేశిత సమయంలో ఈ ఉద్యోగాలు భర్తీ చేస్తామని స్పష్టం చేశారు.సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం యువత ఆకాంక్షలను నెరవేరుస్తోందని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20 నెలల్లో 30,607 ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పుకొచ్చారు. ఉపాధ్యాయ, కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికైన వారికి నియామక పత్రాలు అందించినప్పుడు యువత కళ్లలో ఆనందం చూశామని అన్నారు. ఈ ఏడాది ఇచ్చే నోటిఫికేషన్ల ద్వారా 10,060 ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని స్పష్టం చేశారు. గ్రూప్ 1, గ్రూప్ 2, ఇంజనీరింగ్, టీచింగ్, యూనిఫాం సర్వీసెస్ పోస్టులను భర్తీ చేయనున్నామని తెలిపారు.

# పేదలకు ఆపన్న హస్తం

>> కలిగించనుంది. ప్రభుత్వం ఏర్పడిన 21 నెలల కాలంలో ఫైనాన్సియల్ అసిస్టెన్స్, వైద్య సహాయం, ఎల్ఓసిల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం రూ.1,241 కోట్లకు పైగా ప్రభుత్వం నేరుగా ఆర్థిక సాయం అందించింది. దీని ద్వారా 1,36,240 మంది పేదలకు లబ్ధి చేకూరింది. 2024లో 15,206 మందికి రూ.184 కోట్లు, 2025లో 1,03,568 మందికి రూ.889 కోట్లు, 2026లో ఇప్పటి వరకు 17,466 మందికి రూ.169 కోట్లతో 1,36,240 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వం సాయం చేసింది. ఇప్పుడు తెలుగు సంవత్సరాదిన అదే ఒరవడిని కొనసాగిస్తూ... మరో 6,787 మందికి ప్రయోజనం చేకూర్చే రూ.55.63 కోట్ల విడుదల చేస్తూ ఫైల్ ముఖ్యమంత్రి సంతకం చేశారు. ఆర్థిక సవాళ్లు ఉన్నప్పటికీ, పేదల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు వారి వైద్యపరమైన అవసరాల నిమిత్తం నిధులకు లోటు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వైద్యం చేయించుకుని ఆర్థిక ఇబ్బందులు పడుతోన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధితో ఆర్థిక ఇబ్బందులు తొలుగుతున్నాయి.అంతముందు క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉగాది సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు టీటీడీ, దుర్గగుడి అర్చకులు ఆశీర్వచనం అందించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరి, దుర్గగుడి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనా నాయక్ పాల్గొన్నారు.

# యుపిలో ఉగ్రనెట్‌వర్క్ కుట్రభగ్నం!

**లక్నో, మార్చి 19:** భారత్‌లో ఉగ్రవాద దాడులు జరిపేందుకు కుట్ర పన్నుతున్న ఓ ముఠా పట్టుబడింది. పుణ్యక్షేత్రాలు, కీలక ప్రదేశాల ఫొటోలు, వీడియోలు, లొకేషన్ వివరాలు సరిహద్దు అవతల ఉన్న పాకిస్థాన్ హ్యాండ్లర్లకు సోషల్ మీడియా ద్వారా పంపుతున్నారనే ఆరోపణలపై పాక్ ఆధారిత గ్యాంగ్‌స్టర్ నెట్‌వర్క్‌కు చెందిన ఇద్దరు అనుమానితులను పోలీసులు అరెస్ట్ చేశారు. యుపిలోని హాపుడ్ మొఘల్ గార్డెన్‌లో ఉన్న ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ వద్ద ఇద్దరు యువకులను అరెస్టు చేసినట్లు పోలీసులు గురువారం మీడియాకు వెల్లడించారు. అరెస్టు అయిన యువకులు ఒక ఆలయం, దిల్లీ కాలనీకి సంబంధించిన ఫొటోలు, వీడియోలు, లొకేషన్స్‌ను సోషల్ మీడియా ద్వారా ఒక పాకిస్థానీ గ్యాంగ్‌కు పంపుతున్నారని ఐబీ నుంచి తమకు సమాచారం అందిందని పేర్కొన్నారు. ఈ మేరకు తాము ఇద్దర్ని అరెస్ట్ చేశామని వెల్లడించారు. ధౌలానాలోని మొఘల్ గార్డెన్‌లో ఉన్న ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ వద్ద ఇద్దరు యువకులను అరెస్టు చేశాం. అరెస్టు అయిన ఇద్దరు అనుమానితులలో ఒకరు మొఘల్ గార్డెన్‌కు చెందిన సలీం రాణా కుమారుడు అజీమ్ రాణా, మరొకరు మేరఠ్ జిల్లాలోని జై గ్రామానికి చెందిన నౌషాద్ కుమారుడు ఆజాద్ రాజ్‌పుత్. రాణా దిల్లీలోని ఒక మాల్‌లో డ్రైఫ్రూట్ స్టాల్ నడుపుతున్నాడు. రాణాకు బంధువైన రాజ్‌పుత్ గురుగ్రామ్‌లోని ఒక పైపుల ఫ్యాక్టరీలో కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. వారిద్దరి దగ్గర నుంచి రెండు ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామని హాపుడ్ ఎస్పీ కున్వర్ జ్ఞానంజయ్ సింగ్ తెలిపారు. గాజియాబాద్‌లోని కౌశాంబి పోలీసులు ఆరుగురు యువకులను ఇటీవలే అరెస్టు చేశారు. దేశవ్యాప్తంగా 50 ప్రదేశాలలో రహస్య సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడానికి వారు ప్రణాళికలు వేసినట్లు దర్యాప్తులో తేలింది. ఈ కెమెరాలలో ఒకటి హరియాణాలోని సోనిపత్ రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫామ్ నంబర్ 3 దగ్గర ఉన్న హై వోల్టేజ్ విద్యుత్ లైన్ స్తంభానికి నిందితులు అమర్చారు. ఈ క్రమంలో ఐబీ, ఎన్ఐఏ, ఇండియన్ రైల్వేస్ అధికారుల పర్యవేక్షణలో గాజియాబాద్ పోలీసులు బుధవారం (మార్చి 18) ఆ స్తంభం నుంచి రహస్య సీసీటీవీ కెమెరాను స్వాధీనం చేసుకున్నారు. ఈ మొత్తం నెట్‌వర్క్‌లో ప్రమేయం ఉన్న వ్యక్తులందరినీ గుర్తించడానికి, ఈ ఆపరేషన్ వెనుక ఉన్న కచ్చితమైన ఉద్దేశ్యాన్ని నిర్ధా రించడానికి ఆర్పీఎఫ్, గాజియాబాద్ పోలీసు లు, నిఘా సంస్థలు ప్రస్తుతం దర్యాప్తు చేపడుతున్నాయి.

## వారం - వర్జ్యం

20-03-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, శుక్లపక్షం, ఉత్తరాభాద్ర కార్తె
విదియ రా.2.30
రేవతి రా.2.25
వర్జ్యం : మ.3.15-సా.4.44
దు.ఉ.8.36-ఉ.9.24, మ.12.39-మ.1.27
శుభసమయం: ఉ.9.35-10.15
రాహుకాలం - ఉ.10.30-12.00

## వారఫలం

**మేషం:** ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. వృత్తి, వ్యాపారాలలో ప్రోత్సాహం.

**వృషభం:** నూతన పెట్టుబడులలో తొందరపాటు నిర్ణయాలు వద్దు. దీర్ఘకాలిక సమస్యలు తీరి ఊపిరిపీల్చుకుంటారు.

**మిథునం:** సంగీత, సాహిత్యాలపట్ల ఆసక్తి చూపుతారు. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం. ఉద్యోగులకు బదిలీలు.

**కర్కాటకం:** బ్యాంకింగ్ వ్యవహారాలకు ఎక్కువ సమయం కేటాయించవలసివస్తుంది. వ్యాపారంలో అభివృద్ధిని సాధిస్తారు.

**సింహం:** భూమి కొనుగోలు మొదలైన విషయాలు నెమ్మదిగా సానుకూల పడతాయి. మిత్రుల కలయిక.

**కన్య:** విదేశీయాన, కంప్యూటర్, విద్య మరియు తత్సంబంధమైన వాటికి వ్యూహాలు అనుకూలంగా ఉంటాయి.

**తుల:** సున్నిత వ్యవహారాలలో ఓర్పును చూపడం వలన లాభపడుతారు. దీర్ఘకాలిక సమస్యలు తీరి ఊపిరిపీల్చుకుంటారు.

**వృశ్చికం:** ఉద్యోగములలో బదిలీ వేటువున్నా ఉన్నత పదవీప్రాప్తి సూచనలు ఉన్నాయి. అన్నీ సానుకూలంగా ఉంటాయి.

**ధనుస్సు:** గృహ సంబంధమైన విషయాలు అనుకూలంగా, ప్రోత్సాహకరంగా వుంటాయి. ఆర్థిక పరిస్థితి అనుకూలం.

**మకరం:** ఇరుగుపొరుగు వారితో భేదాభిప్రాయాలు చెప్పుకోదగిన సంఘటనలు కాక పోయినా కొంత అసౌకర్యాన్ని కలుగచేస్తాయి.

**కుంభం:** సాంకేతిక వైద్య రంగములలో విసూత్నమైన మీ ఆలోచనలు ప్రజాదరణను, ప్రభుత్వ ఆమోదమును పొందుతాయి.

**మీనం:** తెలివితేటలను పదును పెట్టి వ్యాపార లావాదేవీలలో లాభపడుతారు. బంగారు ఆభరణాలు కొనుగోలు చేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఇది ఉగాది సంకల్పం

>> ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. కొందరు స్వార్థంతో తల్లికి, చెల్లెలికి ఆస్తులు ఇవ్వని వ్యక్తులు కూడా ఉంటారని ఎద్దేవా చేశారు. అందుకే మళ్లీ ఉమ్మడి కుటుంబాలు ఉండేలా చర్యలు చేపట్టాలని ఆలోచన చేస్తున్నట్లు వివరించారు. 5 కోట్ల మంది తెలుగు ప్రజలందరి జీవన ప్రమాణాలు మెరుగు పర్చటం కోసమే తాను పనిచేస్తున్నట్లు స్పష్టం చేశారు. గత పాలకులు పోలవరం నిర్వాసితులకు పైసా కూడా పరిహారం ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని ప్రాంతాలు సస్యశ్యామలం కావాలంటే పోలవరం పూర్తి కావాలన్నారు. 30,607 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రైవేటు రంగంలో 6.28 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించామని వెల్లడించారు. పరాభవ నామ సంవత్సరంలో తెలుగు జాతి కీర్తి ప్రతిష్టలు ప్రపంచానికి చాటిచెప్పేలా సంకల్పం చేద్దామని పిలుపునిచ్చారు.దేవతల రాజధాని అమరావతి తరహాలో ప్రజా రాజధాని అమరావతి అభివృద్ధి చెందాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. అమరావతితో పాటు అన్ని ప్రాంతాలు అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటామని స్పష్టం చేశారు. 2024కు ముందు ఐదేళ్ల ఎవరూ సంతోషంగా పండుగలు కూడా జరుపుకునే పరిస్థితి లేదని విమర్శించారు. ఒక వ్యక్తి కారణంగా ఎక్కడ చూసినా భయం, విధ్వంసం, దారుణాలు జరిగాయని మండిపడ్డారు. సంపద కొందరికే పరిమితం కాకుండా అందరూ బాగుండాలనే ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని వెల్లడించారు. మన పండుగలు, ఆచారాల్లోనే సైన్సు ఉందని, వాస్తు శాస్త్రాలు,సూర్యనమస్కారాలు ,. ఆచారాలు ఇలాంటివే అని వివరించారు.

సమాజంలో అట్టడుగున ఉండిపోయిన వారిని పేదరికం నుంచి బయటపడేసేలా జీరో పావర్టీ కార్యక్రమం పీ4 చేపట్టామని అన్నారు. పేదల జీవన ప్రమాణాలు పెంచేలా దీనిని అమలు చేస్తున్నట్టు వివరించారు. సమాజంలో సంపన్నులైన 10 శాతం మంది అట్టడుగున ఉన్న 20 శాతం మందిని ఆదుకునేలా పీ4 చేపట్టామని తెలిపారు. తాను పనిచేసేది 5 కోట్ల మంది రాష్ట్రప్రజల కోసమని.. అందరి జీవన ప్రమాణాలు మెరుగుపర్చటం కోసమేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్టరంలో సమగ్ర అభివృద్ధి కోసం విశాఖ, తిరుపతి, అమరావతి కేంద్రాలుగా ప్రాంతీయ ఎకనామిక్ కారిడార్లు తీసుకువచ్చామని అన్నారు. పోర్టులు, ఎయిర్ పోర్టులు, రహదారులు, రైల్వేలైన్లు అనుసంధానం చేసి లాజిస్టిక్స్ వ్యవస్థను తీర్చిదిద్దుతున్నట్టు వివరించారు. ప్రజా రాజధాని అమరావతి అద్భుతంగా అభివృద్ధి సాధించేలా ప్రణాళికలు చేశామని ముఖ్యమంత్రి తెలియచేశారు. తాను అందరివాడిగా ఉండాలని కోరుకుంటున్నానని కొందరు దుష్టులు ఏమార్చే కుట్రలు చేస్తారని వారి నుంచి అప్రమత్తంగా ఉండాలని సీఎం అన్నారు. కూటమి ప్రభుత్వం యువతకు హామీ ఇచ్చినట్టుగానే 20 లక్షల ఉద్యోగాల కల్పనకు సంకల్పం చేశామన్నారు. ఉగాదిని పురస్కరించుకుని 10,060 ఉద్యోగాలను ఏపీపీఎస్సీ ద్వారా భర్తీ చేసేందుకు జాబ్ క్యాలెండర్ జారీ చేశామని తెలిపారు. మే 15 నుంచి అక్టోబరు వరకూ వివిధ నోటిఫికేషన్ల ద్వారా ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. గత 21 నెలల్లో 15,940 మంది టీచర్లకు మెగాడీఎస్సీ ద్వారా ఉద్యోగాలు కల్పించామని, 5757 మంది పోలీసు కానిస్టేబుళ్ల నియామకాలు చేశామన్నారు. ఇప్పటి వరకూ 30,607 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామన్నారు. ఇక ప్రైవేటు రంగంలో 6.28 లక్షల మందికి ఉద్యోగాలు వచ్చాయని వివరించారు. కంజ్యూమర్ జస్టిస్ లో ఏపీ అగ్రస్థానంలో ఉందని ఓ నివేదిక వచ్చిందని.. వినియోగదారులందరికీ న్యాయం జరిగేలా చూస్తున్న రాష్ట్రంగా ఏపీ ముందంజలో ఉందన్నారు. 2047 నాటికి వెల్తీ, హెల్తీ, హ్యాపీ సొసైటీగా ఏపీ మారాలంటే అన్ని రంగాల్లోనూ రాష్ట్రం ముందుండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పరాభవ నామ సంవత్సరంలో తెలుగు జాతి కీర్తి ప్రతిష్టలు ప్రపంచానికి చాటిచెప్పేలా సంకల్పం చేద్దామని సీఎం పిలుపునిచ్చారు.

**విదేశాల్లో మన సంస్కృతికి తెలుగువారే బ్రాండ్ అంబాసిడర్లు..**

సమీప భవిష్యత్తులో పూర్తిస్థాయి సాంకేతికతతో పాలన జరిగే అవకాశం ఉంటుందని, వాతావరణం, ప్రకృతి వైపరీత్యాలు ఇలా వేర్వేరు పరిస్థితులు అప్పటికప్పుడు అధ్యయనం చేసి దానికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకునే పరిస్థితి వచ్చేసిందన్నారు. 30 ఏళ్ల క్రితమే తాను ఐటీ విప్లవాన్ని ఊహించి టెక్నాలజీని ప్రోత్సహించానని తద్వారా చాలా మంది జీవితాల్లో మార్పు వచ్చిందని అన్నారు. నాడు తీసుకున్న నిర్ణయంతోనే హైదరాబాద్ ఇప్పుడు నాలెడ్జి ఎకానమీగా ఎదిగిందన్నారు. ఇప్పుడు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం టెక్నాలజీ, డేటా సెంటర్ల గురించి చర్చిస్తున్నానని ముఖ్యమంత్రి అన్నారు. మన సంస్కృతీ సంప్రదాయాలు నేర్పే విలువలను గౌరవించాలని.. ఇక్కడ ఉండే మనకంటే విదేశాల్లోని ప్రవాస తెలుగు వారు వాటికి బ్రాండ్ అంబాసిడర్లుగా మారారన్నారు. తెలుగు జాతిని ప్రపంచంలో అగ్రస్థానంలో నిలబెట్టటమే తన సంకల్పమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**ఐటీ జీవనోపాధి కల్పిస్తే, సంస్కృతి సంప్రదాయాలు విలువలు పెంపొందిస్తాయి**

విలువలు పతనమైన రోజు జీవితాలు భ్రష్టు పడతాయని ముఖ్యమంత్రి హెచ్చరించారు. ఐటీ జీవనోపాధి కల్పిస్తే, సంస్కృతి సంప్రదాయాలు విలువలు పెంపొందిస్తాయని స్పష్టం చేశారు. ఈ ఏడాది 38 మందికి కళారత్న అవార్డులు, 122 మంది ఉగాది పురస్కారాలకు ఎంపికయిన వారందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగు సంస్కృతి వినూత్నం, పండుగలు విభిన్నం, ప్రకృతిని ఆరాధన, ఆరోగ్యకరమైన జీవన విధానానికి ఇవి ప్రతీకలు అని వివరించారు. ప్రస్తుతం 65 శాతం మేర నీటి నిల్వలు మన రిజర్వాయర్లలో ఉన్నాయన్నారు. మే 15 తేదీనే సాగుకు నీరు విడుదల చేస్తామని నారు మళ్లు వేసుకోవాలని ముందే చెప్పిన ప్రభుత్వం తమదని స్పష్టం చేశారు.కాగిత రహిత పాలనలో భాగంగా సెల్ ఫోన్ ద్వారా రాష్ట్రాన్ని పాలించేలా సాంకేతికతను అందిపుచ్చుకుంటున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఈ ఏడాది ఏ విధంగా సిద్ధం కావాలో అందుకనుగుణంగా సన్నద్ధమై ముందుకు సాగేలా కార్యాచరణ రూపొందించామని వివరించారు. పరాభావ నామ సంవత్సరం అన్ని విధాల బాగుండాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. తీపి, పులుపు, ఉప్పు, కారం, చేదు, వగరు కలయిక అయిన ఉగాది పచ్చడి జీవితాలను ప్రతిబింబిస్తుందని తెలిపారు. షడ్రుచులు మాదిరే జీవితంలో కష్టసుఖాలను ఎదుర్కోవాలన్నారు. ముఖ్యమంత్రిగా మూడుసార్లు ముచ్చటగా గోదావరి, కృష్ణా పుష్కరాలు నిర్వహించే అవకాశం తనకు లభించిందని చెప్పారు. నీటి భద్రత, ప్రకృతి పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామని స్పష్టం చేశారు. మార్చి నాటికి అన్ని జలాశయాలు కలకళలాడేలా నీటి భద్రతకు ప్రాధాన్యం ఇచ్చామని వివరించారు.

**రాష్ట్రానికి ఆర్థిక ప్రగతి ప్రజలకు సుఖ శాంతులు - మాడుగుల నాగఫణిశర్మ..**

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ పంచాంగ పఠనం చేశారు. శ్రీ పరాభవ నామ సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వానికి విజయం సిద్ధిస్తుందని పేర్కొన్నారు.ప్రభుత్వం సంకల్పించిన ప్రతీదీ ఫలిస్తుందని స్పష్టం చేశారు. తెలుగు వారు ఏ రంగంలో ఉన్నా అగ్రస్థానంలో ఉండాలన్న ముఖ్యమంత్రి సంకల్పం నెరవేరుతుందని వివరించారు.



ప్రయాగ్‌రాజ్‌లో గురువారం నవరాత్రి పండుగ మొదటి రోజున గంగా నది తీరంలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

# అప్రకటిత ఎమర్జెన్సీ ప్రకటిస్తున్న కేంద్రం

## బెంగాల్ సిఎం మమతా బెనర్జీ ధ్వజం

**కోల్‌కత్తా, మార్చి 19:** ఎన్నికల ప్రకటనకు ముందే 50 మందికి పైగా ఉన్నతాధికారులను బదిలీ చేయడం అప్రకటిత ఎమర్జెన్సీలా ఉందని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ధ్వజమెత్తారు. సోషల్‌మీడియాలో స్పందించిన మమతా బెనర్జీ, ఆ చర్యలు పరిపాలనా అవసరాల వల్ల కాకుండా రాజకీయ ఒత్తిడి కారణంగానే జరుగుతున్నాయని ఆరోపించారు. ఈసీ బెంగాల్‌ను ప్రత్యేకంగా లక్ష్యంగా చేసుకోవడం ఇదివరకెన్నడూ చూడని విషయమని, ఇది చాలా ఆందోళనకర పరిణామని ఆమె అన్నారు. చీఫ్ సెక్రటరీ, హోమ్ సెక్రటరీ, డీజీపీ, అదనపు డీజీలు, ఐజీలు, డీఐజీలు, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు వంటి కీలక పోస్టుల్లో ఉన్న అధికారులను ఒక్కసారిగా బదిలీ చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకు విఘాతం కలిగిస్తుందని మమతా అభిప్రాయపడ్డారు. ఈ చర్యలు రాజ్యాంగ సూత్రాలను దెబ్బతీస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. ఇది పరిపాలనాపరమైన చర్య కాదని,అత్యున్నత స్థాయి రాజకీయ జోక్యం. స్వతంత్రంగా ఉండాల్సిన సంస్థలను సొంతానికి ఉపయోగించుకోవడం రాజ్యాంగంపై నేరుగా దాడి చేసినట్లేనని మమతా విమర్శించారు. అదేవిధంగా, ఎన్నికల అదనపు ఓటరు జాబితాల విడుదలలో ఆలస్యం జరుగుతుండటంపై కూడా ఆమె తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా ఈసీ వ్యవహరిస్తోందని ఆమె ఆరోపించారు. దీనివల్ల ప్రజల్లో అనిశ్చితి నెలకొంటోందని పేర్కొన్నారు. బీజేపీ ఎందుకు ఇంత ఆత్రుతగా వ్యవహరిస్తోంది ఐబీ, ఎస్టీఎఫ్, సీఐడీ వంటి కీలక భద్రతా సంస్థల అధికారులను కూడా ఎంపిక చేసి బదిలీ చేస్తున్నారని మమతా అన్నారు. దీని వల్ల రాష్ట్ర పరిపాలనా వ్యవస్థ బలహీనపడుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. బెంగాల్ ప్రజలను ఎందుకు ఇలా లక్ష్యంగా చేసుకుంటోంది. స్వాతంత్రం వచ్చిన 78 సంవత్సరాల తర్వాత కూడా ప్రజలు తమ పౌరసత్వాన్ని నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఎందుకంటూ మమత ప్రశ్నించారు. ఒకవైపు అధికారులను విధుల నుంచి తొలగించి, మరోవైపు వారినే ఎన్నికల పరిశీలకులుగా నియమించడం ఈసీ చర్యల్లో విరుద్ధతను చూపుతోందని ఆమె విమర్శించారు. సిలిగురి, బిధన్నగర్ వంటి నగరాల్లో పోలీసు నాయకత్వం తాత్కాలికంగా లేకపోవడం భద్రతా లోపానికి దారితీస్తుందని ఆమె అన్నారు. ఈ పరిస్థితిని అన్‌డిక్లేర్డ్ ఎమర్జెన్సీగా పేర్కొన్న మమతా, ఇది యాదృచ్ఛికం కాదని, ఒక ప్రణాళికాబద్ధమైన చర్య అని ఆరోపించారు. ఇది ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధంగా సంస్థల దుర్వినియోగం ద్వారా బంగాల్‌పై నియంత్రణ సాధించేందుకు చేస్తున్న ప్రయత్నమని ఆమె అన్నారు.

# 88 మందితో బిజెపి అభ్యర్థుల జాబితా

**గువాహతి, మార్చి 19:** అస్సాం అసెంబ్లీ ఎన్నికల కు సంబంధించి బీజేపీ తన అభ్యర్థుల తొలి జాబితా ను విడుదల చేసింది. మొత్తం 88 మంది అభ్యర్థుల పేర్లను పేర్కొంది. అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ జాలుక్‌బారీ నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నారు. ఇది ఆయనకు కంచుకోటగా మారింది. 2001, 2006, 2011, 2016, 2021 ఎన్నికల్లో హిమాంత ఇక్కడి నుంచే విజయం సాధించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి వచ్చిన కీలక నేతల పేర్లు కూడా తాజా జాబితాలో ఉన్నాయి. ఇటీవల బీజేపీలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర విభాగం మాజీ అధ్యక్షుడు భూపేన్ కుమార్ బోరా బిహ్‌పురా నియోజకవర్గం నుంచి బరిలోకి దిగారు. ఇక బుధవారం కాంగ్రెస్‌ను వీడి కాషాయం కండువా కప్పుకున్న ప్రద్యుత్ బోర్డోలోయ్ డిస్పూర్ నుంచి పోటీ చేయనున్నారు. కాగా 126 అసెంబ్లీ స్థానాలు ఉన్న అస్సాంలో ఏప్రిల్ 9న పోలింగ్ జరగనుంది. మే 4న ఫలితాలు వెలువడనున్నాయి.

# యానిమేషన్ పితామహుడు, డోరేమాన్ సృష్టికర్త కన్నుమూత

**టోక్యో, మార్చి 19:** ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది చిన్నారులను తన యానిమేషన్‌తో అలరించిన ప్రముఖ దర్శకుడు షిబాయామా సుటోము (84) కన్నుమూసారు. గత కొంతకాలంగా ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో పోరాడుతున్న ఆయన, ఈనెల 6న తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని ఆయన సహవ్యవస్థాపకుడిగా ఉన్న అజియాడో యానిమేషన్ వర్క్స్ స్టూడియో మార్చి 17, 2026న అధికారికంగా ప్రకటించింది. షిబాయామా సుటోము పేరు వినగానే అందరికీ గుర్తొచ్చేది డోరేమాన్. 1979లో ఈ సిరీస్‌కు దర్శకత్వం వహించడం ప్రారంభించిన ఆయన, దాదాపు రెండు దశాబ్దాల పాటు ఆ బాధ్యతలను విజయవంతంగా నిర్వహించారు. కేవలం టీవీ సిరీస్‌నే కాకుండా, డోరేమాన్ ఫ్రాంఛైజీలో వచ్చిన 22 ఫీచర్ చిత్రాలకు కూడా ఆయనే దర్శకత్వం వహించడం విశేషం. జపాన్‌లో ఆయనను గౌరవపూర్వకంగా జాతీయ యానిమేషన్ పితామహుడు" అని పిలుచుకుంటారు. 1963లో టోయీ యానిమేషన్‌తో తన ప్రయాణాన్ని ప్రారంభించారు షిబాయామా సుటోము. డోరేమాన్‌తో పాటు చిబీ మారుకో చాన్, లూపిన్ III, కైకెట్సు జోరోరి వంటి హిట్ సిరీస్‌లకు పనిచేశారు. 1978లో ఒసాము కోబయాషి - మిచిషిరో యమడాలతో కలిసి అజియాడో యానిమేషన్ వర్క్స్ సంస్థను స్థాపించారు. యానిమేషన్ రంగానికి ఆయన చేసిన అసమాన సేవలకు గుర్తింపుగా, 2012లో జపాన్ ప్రభుత్వం ఆయనను జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించింది.

# 3 ఏకలవ్య విద్యాలయాలు

>> పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఏప్రిల్ నెలలో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన గిరిజన సమస్యలు, బడ్జెట్ వినియోగంపై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. నెల్లూరులో జరిగిన సమావేశంలో గిరిజన సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల సంస్థల ప్రతినిధులు తమ దృష్టికి తీసుకువచ్చిన ప్రతి అంశాన్ని కూడా చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. జిల్లాలో గిరిజనుల అభ్యున్నతికి అధికారులు సమన్వయంతో పని చేసి ప్రభుత్వ ఫలాలు వారికి అందించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, కాకర్ల సురేష్ పాల్గొని గిరిజనులకు ఆధార్, రేషన్ కార్డుల జారీ, ఇళ్ల స్థలాలు, గృహాల మంజూరు, విద్యా అవకాశాల మెరుగుదల వంటి అంశాలను కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం గిరిజన సంఘాల నాయకుల నుండి పలు వినతులను కమిషన్ ఛైర్మన్ స్వీకరించారు. ఈ సమావేశంలో ఐటీడీఏ అధికారులు శ్రీనివాసరావు, సుజాత, పలువురు జిల్లా స్థాయి అధికారులు, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ధర్మడం నుంచే కేరళ సిఎం నామినేషన్

**తిరువనంతపురం, మార్చి 19:** కేరళలోని ధర్మడం నియోజకవర్గం నుంచి సీఎం పినరయి విజయన్ నామినేషన దాఖలు చేశారు. ఏప్రిల్ 9న కేరళలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనున్నది. ఈ నేపథ్యంలో అక్కడి నామినేషన్‌ల పర్వం మొదలైంది. అందులో భాగంగానే విజయన్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఉదయం 11 గంటల సమయంలో తలస్సెరి సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో నామినేషన్ పత్రాలను సమర్పించారు. అంతకుముందు బుధవారం తన నియోజకవర్గంలో రోడ్‌షో నిర్వహించారు. 80 ఏళ్ల వయసులోనూ ఉత్సాహంగా ప్రచారం మొదలుపెట్టిన విజయన్ తన రాజకీయ జీవితంలో అసెంబ్లీ ఎన్నికలకు పోటీ చేయడం ఇది ఏడోసారి. ధర్మడం నుంచి బరిలో దిగడం ఇది మూడోసారి. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ తరఫున వీపీ అబ్దుల్ రషీద్ బరిలో నిలువగా బీజేపీ అభ్యర్థిగా రంజిత్ పోటీ చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ 9న 140 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో పోలింగ్ జరుగనుంది. పినరయి తోపాటు వివిధ పార్టీలనుంచి అభ్యర్థులు నామినేషన్లు కోలాహలంగా అనుచరులతో వచ్చి దాఖలుచేస్తున్నారు.

# ఉద్యోగాల భర్తీకి జాబ్ క్యాలెండర్

>> ఉద్యోగాల కల్పనకోసంసంకల్పించాం,10,060 ఉద్యోగాలను ఏపీపీఎస్సీ ద్వారా భర్తీ చేసేందుకు జాబ్ క్యాలెండర్ జారీ చేశాం.15,940 మంది టీచర్లకు మెగాడీఎస్సీ ద్వారా ఉద్యోగాలు కల్పించాం, 5757 మంది పోలీసు కానిస్టేబుళ్ల నియామకాలు చేశాం.30,607 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం. ప్రైవేటు రంగంలో 6.28 లక్షల మందికి ఉద్యోగాలు వచ్చాయి.20లక్షల ఉద్యోగాలు కల్పన చేస్తామని హామీ ఇచ్చాం దానిని నెరవేరుస్తాం అన్నారు.మే 15 నుంచి అక్టోబరు 15 వరకూనోటిఫికేషన్లు ఇచ్చి ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు.

# విశ్వఖగోళంలో భారీ జలమేఘం!

**న్యూఢిల్లీ, మార్చి 19:** శాస్త్రవేత్తలు 12 బిలియన్ కాంతి సంవత్సరాల దూరంలో ఒక విశ్వ మేఘాన్ని గుర్తించారు. ఈ మేఘంలో భూమిపై ఉన్న సముద్రాలన్నింటికన్నా 140 ట్రిలియన్ల రెట్లు ఎక్కువ నీరు ఉంది. ఇది మన విశ్వం ఎంత విశాలమైనదో, మరియు ప్రాథమిక కాలంలోనే జీవం ఏర్పడే అవకాశం ఉన్నదని సూచిస్తుంది.

ఈ మేఘం విశ్వ ఆరంభంలోనే ఏర్పడిందని ఆ సమయంలో గెలాక్సీలు, కృష్ణబిలాలు నిర్మాణమవుతున్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ మేఘం ఒక క్వాజార్ చుట్టూ ఉంది. దాని కేంద్రంలో ఒక అతి భారీ కృష్ణబిలం ఉంది, బరువు సూర్యుని కంటే 20 బిలియన్ల రెట్లు ఎక్కువ. ఈ కృష్ణబిలం చుట్టూ వేడి వాయువు ఉంది, ఇందులో అధిక మోతాదులో నీటి ఆవిరి ఉంది. ఇంత పెద్ద పరిమాణంలో నీరు ఉండటం శాస్త్రవేత్తలకు ఆశ్చర్యం కలిగిస్తోంది.

ఎందుకంటే జీవానికి నీరు అత్యవసరం, మరియు విశ్వ ప్రారంభ దశలోనే ఇంత నీరు ఉండటం జీవం ఏర్పడే పరిస్థితులు ముందే ఏర్పడాయని సూచిస్తోందని దీని ఆధారంగా, జీవానికి అవసరమైన మూలకాలు మన సౌర వ్యవస్థకే పరిమితం కాకుండా, విశ్వమంతటా విస్తరించాయని అర్థమవుతున్నట్లు పరిశోధకులు చెపుతున్నారు.

# తెలుగు ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబు, డి.సిఎం పవన్

**విజయవాడ,మార్చి19,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు ప్రజలకు శ్రీపరాభవ నామ సంవత్సరం ఉగాది పండుగను జరుపు కొంటున్న. సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ , హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ తెలుగు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు ప్రధాని నరేంద్ర మోదీ తెలుగు ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా ఆయన ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు పంచుకున్నారు. ఉగాది పండుగతో అందరి జీవితాల్లో కొత్త శక్తి ప్రారంభమవుతుందన్నారు. ఈ ఏడాది కూడా ప్రజలందరి జీవితాల్లో ఆనందం, ఆరోగ్యం, విజయాలతో నిండాలని ఆకాక్షించారు. శ్రీ పరాభవ నామ సంవత్సరం అందరికీ శుభప్రదంగా ఉండాలని ప్రధాని మోదీ కోరుకున్నారు. పరాభవ నామ సంవత్సరం అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని సీఎం చంద్రబాబు నాయుడు కోరుకున్నారు. పేదరికం లేని సమసమాజం నిర్మాణానికి పీ4, వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందరు అందిపుచ్చుకోవాలని తెలిపారు. ఉగాది తెలుగువారికి ఆరోగ్యం, అష్ట ఐశ్వర్యాలు ప్రసాదించాలనన్నారు. తెలుగు ప్రజలందరికి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది పరాభవ నామ సంవత్సర పేరిట మన ముందుకు వస్తుందని తెలుగు ప్రజలకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. పరాభవో న జ్ఞాతవ్యఖి అంటే పరాభవానికి దారి తీసే పనులు చేయవద్దని పెద్దలు చెబుతుంటారన్నారు. పెద్దల మాటలు పాటిస్తూ జాగ్రత్త వహించడమే మన విధని చెప్పారు. ఉగాది పండుగతో ప్రజలందరి జీవితాల్లో ఆరోగ్యం, అష్ట ఐశ్వర్యాలు ప్రసాదించాలని కోరుకున్నారు. తెలుగు సంవత్సరాది శ్రీ పరాభవ నామ ఉగాది సందర్భంగా అందరికీ సర్వశుభాలు కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. నూతన



సంవత్సరంలో ప్రజా సంక్షేమం, రాష్ట్ర ప్రగతిలో దేశంలోనే అగ్రస్థానంలో మన ఆంధ్రప్రదేశ్ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు చెప్పారు. అందరి ఇళ్లల్లో ఆయురారోగ్య ఆనందాల ఉత్సవం తీసుకొచ్చే ఉగాది సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.చైత్ర శుద్ధ పాడ్యమి, పరాభవ నామ సంవత్సరం సందర్భంగా అందరికీ హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది పచ్చడిలోని షడ్రుచుల వలే జీవితం కూడా అనేక పరిస్థితుల సమ్మేళనం అనే సంకేతాన్ని అందరూ అర్థం చేసుకొని ధైర్యంతో, ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగి జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలని కోరారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని తెలుగు వారందరికీ ఉగాది శుభాకాంక్షలు చెప్పారు.

# అసత్యాలతో ప్రజలను మోసగిస్తున్న సిఎం చంద్రబాబు : మాజీ ముఖ్యమంత్రి జగన్

**వైయస్సార్‌సిపి కార్యాలయంలో ఘనంగా పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలు - రాష్ట్ర ప్రజలకు వైయస్ జగన్ ఉగాది శుభాకాంక్షలు - ఈ ఏడాది విపక్షానికి మంచి భవిష్యత్తు ఉందన్న పంచాంగం శ్రవణం చేసిన పిడపర్తి భాస్కర సుబ్రమణ్యశాస్త్రి**



జగన్ దంపతులకు వేదాశ్శీస్సులు అందిస్తున్న పండితులు

**విజయవాడ,మార్చి19,ప్రభాతవార్తప్రతినిధి:** వైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. .ఉగాది వేడుకలకు మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్, వైయస్ భారతి దంపతులుహాజరయ్యారు.సాంప్రదాయ పంచెకట్టు, భుజాన కండువాలో ఉగాది వేడుకలకు వైయస్ జగన్ హాజరయ్యారు.ఉగాది వేడుకలు, పంచాంగ శ్రవణం కార్యక్రమానికి వచ్చిన వైయస్ జగన్ దంపతులకు పూర్ణకుంభంతో వేద పండితులు స్వాగతం పలికారు.ఉగాది వేడుకల కోసం పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రత్యేక వేదిక ఏర్పాటు. పూజా మందిరంలా వేదికను రూపొందించారు. శాస్త్రోక్తంగా పూజ తర్వాత .జగన్ దంపతులకు పండితులు వేదాశ్శీస్సులు అందించారు.పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని పిడపర్తి భాస్కర సుబ్రమణ్యశాస్త్రి వినిపించారు.నూతన సంవత్సరంలో విపక్ష బల గణీయంగా మారుతుందని తెలిపారు. రాజకీయ పరిణామాల్లో నూతన మార్పులు చోటు చేసుకుంటాయని తెలిపారు.మాజీ సీఎం జగన్ రాజకీయంగా ఉజ్వల భవిష్యత్తు ఉండదని వెల్లడించారు.పంచాంగ శ్రవణం అనంతరం జగన్ మాట్లాడుతూ కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరితో పాటు, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పార్టీ నేతలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఇంకా రెండు తెలుగు రాష్ట్రాలలో సంవత్సరాది పర్వదినాన్ని ఘనంగా జరుపుకుంటున్న అందరికీ వైయస్ జగన్, హృదయపూర్వకంగా పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు.రాష్ట్ర ప్రజలను ప్రభుత్వం తప్పుద్రోవ పట్టిస్తుందని వ్యాఖ్యానించారు.తమ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ఇప్పటి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందన్నారు. ప్రజలు వాస్తవాలు గమనిస్తుందన్నారు.దేవుడిని కుడా రాజకీయాలకు ఇప్పటి ప్రభుత్వం వాడుకుంటుందన్నారు.ఆడబిడ్డలకు రక్షణ లేకుండా పోయిందన్నారు.మత్తులో ఆ పార్టీ నేతలు జోగుతున్నారు.అసత్యాలతో సీఎం చంద్రబాబు ప్రజలను మోసగిస్తున్నారన్నారు. ఉగాది వేడుకలకు పార్టీ ముఖ్యనేతలు, నాయకులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు హాజరయ్యారు.



## కోనలో వైభవంగా పరాభవ నామ సంవత్సర వేడుకలు

**- ముగ్గురు అర్చకులకు ఉగాది పురస్కారాలు**

**రాపూరు (నెల్లూరు), మార్చి 19, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో గురువారం నూతన తెలుగు సంవత్సర(ఉగాధి), పరాభవ నామ సంవత్సర వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఇందులో బాగంగా ఉదయం 4 గంటలకు శ్రీవార్లకు పట్టువస్త్రాల సమర్పణ, 4.10కి శ్రీవార్లకు అభిషేకం, 5 గంటలకు పూలాంగీ సేవ,బంగారు గరుడ వాహన సేవ, 10.30కి పంచాంగ శ్రవణము, 11 గంటలకు శ్రీవారి కళ్యాణం నిర్వహించారు. సాయంత్రం గోనుపల్లి గ్రామంలో స్వామి వారికి ఉగాధి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉగాధి పురస్కారములలో బాగంగా అర్చక స్వాములకు ఒక్కొక్కరికి రూ.10116 చోప్పున పారితోషకాన్ని అందజేసి వారికి శాలువా కప్పి, స్వామి వారి చిత్రపటాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు.

# మన సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించుకోవాలి : మంత్రి కొల్లు రవీంద్ర

**గన్నవరం(కృష్ణా), మార్చి 19, ప్రభాతవార్త :** భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖా మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. గురువారం ఉదయం కృష్ణా జిల్లాకేంద్రమైన మచిలీపట్నంలో బచ్చుపేట వెంకటేశ్వరస్వామి కళ్యాణ మండపంలో దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో జిల్లా అధికార యంత్రాంగం శ్రీపరాభవనామ సంవత్సర ఉగాదివేడుకలు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన మంత్రి ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది రోజున పంచాంగ శ్రవణం ఎంతో ప్రసిద్ది చెందిందన్నారు. పూర్వకాలంలో ఋషులు ఆయా కాలాల వాతావరణ పరిస్థితులను అంచనావేసి, ఏఏ పంటలకు అనుకూల వాతావరణం ఉంటుందో ఉగాదిరోజున పంచాంగశ్రవణం ద్వారా తెలియచేసేవారన్నారు. దీనిని బట్టి రాజ్యాధినేతలు రైతులకు సూచనలు ఇచ్చేవారని తెలిపారు. నాగరిక ప్రపంచంలో శాస్త్రవిజ్ఞానం అభివృద్ధి చెందటంతో ప్రకృతి విపత్తులను సమర్ధవంతంగా ఎదుర్కొంటున్నామన్నారు. శాస్త్రవిజ్ఞానం ఎంతగా అభివృద్ది చెందినా పంచాగాన్ని మాత్రం ప్రజలందరూ విశ్వసిస్తారని పేర్కొన్నారు. సర్వమతాలను





ఉగాది వేడుకల్లో ప్రసంగిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, పక్కనే ఆర్టీసి చైర్మన్ కొనకళ్ల నారాయణ, కలెక్టర్ బాలాజీ తదితరులు

గౌరవింటం మన సనాతనధర్మం సంప్రదాయం అన్నారు. ఇటీవల ముస్లిం సోదరులకు ముఖ్యమంత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసారని, క్రైస్తవులకు ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించిన సంగతిని ఈసందర్భంగా మంత్రి గుర్తుచేసారు. తమ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అభివృద్ధివైపు దూసుకు పోతుందన్నారు. వచ్చే పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్ట నిర్మాణం పూర్తిచేస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. బందరు ఓడరేవు నిర్మాణం కూడా పూర్తిచేసే విధంగా నిర్మాణ పనులను వేగవంతం చేసినట్లు మంత్రి చెప్పారు. రాజధాని అమరావతిలోనూ నిర్మాణాలు జోరందుకున్నాయని వివరించారు. రాష్ట్రఅభివృద్దికి ప్రతిఒక్కరూ సహకరించాలని మంత్రి రవీంద్ర విజ్ఞప్తి చేసారు. జిల్లాకలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ తీపి, చేదు, కలయిక ఉగాది పచ్చడిలా జీవితంలో కూడా కష్టాలు, నష్టాలు, ఆనందాలు, లాభాలు ఉంటాయన్నారు. అన్నింటినీసమానంగా అంగీకరించాలన్నారు.

# అణుయుద్ధం కంటే ప్రమాదకరమైనది కణయుద్ధం: గెంటేల వెంకటరమణ

**- శ్రీగురుధామ్ ధర్మక్షేత్రంలో శాస్త్రోక్తంగా ఉగాది వేడుకలు**



సద్గురు పల్లకీసేవ వేడుకలో ప్రముఖ తాత్వికులు గెంటేల వెంకటరమణ, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

**జగ్గయ్యపేట, మార్చి 19, ప్రభాతవార్త :** దినదిన ప్రవర్ధమానమవుతున్న శాస్త్రవిజ్ఞాన పరిజ్ఞానం ప్రకృతికి విరుద్ధంగా, విపత్తుగా మారినప్పుడు ప్రకృతే తనను బాగుచేసుకుంటుందని ఈ క్రమంలో మానవాళికి సకల జీవరాశికి కొంత నష్టం వాటిల్లటమనేది సర్వసాధారణమని ఈ ఉగాది నుండి ఈ ప్రక్రియ కార్యరూపం దాల్చుతుందని డాక్టర్ ఏపిజె అబ్దుల్‌కలాం అంతర్జాతీయ పురస్కార గ్రహీత, ప్రముఖ తాత్వికులు గెంటేల వెంకటరమణ ప్రవచించారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలంలోని బలుసు పాడు శ్రీగురుధామ్ ధర్మ క్షేత్రంలో గురువారం శివానందగురు కల్చరల్ ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీపరాభవ నామ ఉగాది పర్వదిన ఉగాది వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. ధర్మప్రచారకులు గెంటేల వెంకటరమణ- వసంతలక్ష్మి గురు దంపతులతోపాటు భక్తులందరూ సద్గురు సన్నిధానంలో సద్గురు శ్రీశివానంద భగవాన్ల ఆరాధన, శాంతిహోమం - పూర్ణా హుతి, భగవదారాధన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం శ్రీగెంటేల వెంకట రమణ అనుగ్రహ భాషణచేస్తూ అణుయుద్ధం కంటే కణయుద్ధం అత్యంత ప్రమాదకరమైన దన్నారు. అణువులుగా విస్తరించివున్న సృష్టిలో ప్రతికణం కూడా కలుషితమవుతున్న పరిస్థితుల వల్ల తీవ్రగడ్డ పరిస్థితులను ఎదుర్కొనవలసి వస్తుందన్నారు. ఈ సంవత్సరం సెప్టెంబర్ వరకు విశ్వవ్యాప్తంగా ప్రతికూల పరిస్థితులు నెల కుంటాయని గ్రహగతులు సూచిస్తున్నాయన్నారు. నిరంతరం అప్రమత్తతతో ధర్మంపట్ల శ్రద్ధ, నిష్ట కలిగివుండటం ద్వారా విపత్తుల నుండి రక్షణ పొందవచ్చునన్నారు. సరైన దృక్పథం కలిగి వుండటం ద్వారా రాశులు శుభఫలితాలను ఇస్తాయని, కాలం మన చేతిలో లేదని చెప్పేదే పంచాంగమన్నారు. ప్రకృతితో సహజీవనంచేస్తూ పరోపకార గుణంతో ధర్మంగా ప్రవర్తించేవారి జాతక దోషాలు పరిహారం అవుతాయని, గ్రహాలు సైతం అనుగ్రహాలుగా మారుతాయని ప్రవ చించారు. అనంతరం శాంతి హోమం, పూర్ణా హుతి నిర్వహించారు. కార్యక్రమాల్లో జగ్గయ్యపేట ఎంఎల్‌ఏ శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), ప్రముఖులు శ్రీరాం ధనుంజయ, ఎస్‌జివిఎస్ కళాశాల ప్రధాన కార్య దర్శి, హైకోర్టు న్యాయవాది గెంటేల అశోక చక్రవర్తి, సిఐ వెంకటేశ్వర్లు పలు ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే రాజగోపాల్ సద్గురు పల్లకీసేవ, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భాగస్వామి అయ్యారు.



## 'నా ఛాంప్‌తో కలిసి ఉగాది జరుపుకుంటున్నా మంత్రి లోకేష్

**విజయవాడ,మార్చి19,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు వారి కొత్త సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని సందర్భంగా ఏపీ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తన కుటుంబంతో కలిసి వేడుకలు జరుపుకున్నారు. తన కుమారుడు దేవాన్ష్‌తో కలిసి ఉగాది సంబరాలు చేసుకున్నట్లు సోషల్ మీడియా వేదికగా తెలిపారు. ఈ మేరకు దేవాన్ష్‌తో కలిసి పూజలు చేస్తున్న ఫొటోలను ఆయన పంచుకున్నారు."నా ఛాంప్‌తో కలిసి ఉగాది జరుపుకుంటున్నాను" అంటూ లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ కొత్త ఏడాదిలో చేదు అనుభవాలు తగ్గి, తీపి జ్ఞాపకాలు ఎక్కువగా ఉండాలని ఆకాంక్షించారు. పండగ సందర్భంగా తన కఠినమైన డైట్‌ను ఒక రోజు పక్కన పెట్టి, పండగ భోజనాన్ని ఆస్వాదించబోతున్నట్లు సరదాగా వ్యాఖ్యానించారు. ప్రస్తుతం లోకేశ్ పంచుకున్న ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు, నెటిజన్లు లోకేశ్‌కు, ఆయన కుటుంబ సభ్యులకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. అటు, నారా లోకేశ్ అర్ధాంగి నారా బ్రహ్మణి కూడా తెలుగు ప్రజలకు ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు ట్వీట్ చేశారు. "తెలుగు వారందరికి శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు. మీరు మీ కుటుంబ సభ్యులు ఈ సంవత్సరం అంతా సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో ఆనందం గా ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. ఉగాది కేవలం ఒక పండుగ మాత్రమే కాదు. మన సంస్కృతి. కష్టాన్ని సుఖాన్ని సమభావంతో తీసుకోవాలనే ఆలోచనకు వేదిక. మన తొలి పండుగ అయిన ఉగాది మీ జీవితంలో వెలుగులు నింపాలని కోరుకుంటున్నాను" అంటూ తన పోస్టులో పేర్కొన్నారు.

# పిన్నెల్లి జైలు నుండి విడుదల - కార్యకర్తల్లో ఉత్సాహం





**వెంకటాచలం (నెల్లూరు), మార్చి 19, ప్రభాతవార్త :** మాజీ శాసనసభ్యులు పిన్నెల రామకృష్ణారెడ్డికి ఎట్టకేలకు కోర్టు బెల్ మంజూరు చేసింది. బుధవారం ఉదయం 10 గంటల సమయంలో నెల్లూరు సెంట్రల్ జైలు నుండి జైలు అధికారులు పిన్నిల రామకృష్ణారెడ్డిని విడుదల చేశారు. పిన్నెలకు బేలు మంజూరు కావడంతో మాచర్ల పలనాడు నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు నెల్లూరు సెంటర్ జైలు వద్దకు చేరుకున్నారు. మాజీ మంత్రులు కాకాని గోవర్ధన్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, నెల్లూరు రూరల్ ఇంచార్జ్ ఆన్ విజయకుమార్ రెడ్డి, పిన్నిలకు జైలు వద్ద స్వాగతం పలికారు. 98 రోజుల తర్వాత పిన్నెలకు బేలు మంజూరు కావడంతో కార్యకర్తల ఉత్సాహం నెలకొంది. అక్కడినుంచి కాకాని ఇంటికి చేరుకున్న పిన్నెల రామకృష్ణారెడ్డి, కాకాని గోవర్ధన్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి, కొంతసేపు ఏకాంతంగా రాజకీయాలపై చర్చించుకున్నారు. అనంతరం కాకాని మాట్లాడుతూ ఎన్ని అక్రమ కేసులు బనాయించిన భయపడే ప్రసక్తే లేదని, అక్రమాలకు పాల్పడిన అధికారులు నాయకులు పై తిరిగి మూల్యం తప్పదని హెచ్చరించారు.

## మల్లన్నసాగర్ ప్రధాన కాలువకు గండి

**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో కీలకమైన మల్లన్న సాగర్ ప్రధాన కాలు వకు గండిపడింది. ప్రాజెక్టు నుంచి దుబ్బాక ప్రాంతానికి వచ్చే కాలువకు దుబ్బాక మున్సిపాలిటీ పరిధి లోని చెల్లాపూర్ గ్రామ సమీపంలో గండి పడింది. దీంతో నీరంతా వృథాగా చెల్లాపూర్ కందూరు చెరులోకి వెళు తోంది. గండి కారణంగా కెనాల్ పక్కనే ఉన్న రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వేసవి కాలం సమీపిస్తున్న వేళ పంట పొలాలకు నీరు అందక వరి పంటలు ఎండి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో చెల్లాపూర్ సమీపంలోని కెనాల్ కాల్వకు గండి పడటంతో పక్కనే ఉన్నటువంటి రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ వైపు వెళ్లే కెనాల్ కాలువ కింద అక్కడే ఉన్న చెరువులోకి నీళ్ల మళ్లడంతో అప్పు చేసి వేసిన పంటలు ఎండిపోతయో అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

# తిరుమల సమాచారం

## ఉగాదిరోజు బంగారువాకిలిలో పంచాంగశ్రవణం



**తిరుమల, మార్చి19ప్రభాత వార్తప్రతినిధి:** తెలుగు నూతన సంవత్సరం పరాభవనామ "ఉగాది" పండుగ ఆస్థానం ఆనందనిలయంలోని వేంకటేశ్వరస్వామి కొలువైన బంగారు వాకిలిలో శాస్త్రోక్తంగా జరిపించారు. కలియుగప్రత్యక్షదైవం తిరుమలేశుని తెల్లవారుజామున 3గంటలకు సుప్రభాతంతో మేల్కొలిపారు. అనంతరం ఆలయ శుద్ధి చేసి, 6గంటలకు శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామివారికి ,విశ్వక్సేనుల వారికి విశేష సమర్పణ జరిపించారు. ఉదయం 7గంటల నుండి 9గంటల వరకు విమానప్రాకారం,ధ్వజస్తంభం చుట్టూ ఊరేగింపుగా ఆలయంలోనికి ప్రవేశించారు. ఈ వైదిక కార్యక్రమాలు ముగిసిన తరువాత శ్రీవేంకటేశ్వరస్వామి మూలవిరాట్టుకు ,ఉత్సవమూర్తులకు ఆగమోక్తంగా నూతన వస్త్రాలను ధరింపజేశారు. ఆ తరువాత ఆలయంలోపల బంగారువాకిలిలో తిథి,నక్షత్ర,వార,మాస, సంవత్సర రాశి ఫలాల పంచాంగ శ్రవణం జరిగింది. ఉగాది ఆస్థానాన్ని బంగారు వాకిలివద్ద ఆగమపండితులు, అర్చకులు ఆగమోక్తంగా నిర్వహించారు. దేశవిదేశాలలో తెలుగుప్రజలు ఉగాది పర్వదినం అంతా శుభాలు కలగాలని టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర ఆకాంక్షించారు. ఆలయ ప్రాకారం అంతటా పచ్చటి తోరణాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఈ వేడుకల్లో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఇఒ రవిచంద్ర, అదనపు ఇఒ సతీమణి,టిటిడి సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ ప్రధాన అర్చకుడు కిరణ్‌దీక్షితులు, ఆలయ పేష్కార్ రామకృష్ణ, విజిలెన్స్ వింగ్ విఎస్ఒ ఎన్టీవిరామ్‌కుమార్, విఎస్ఒ సురేంద్ర, ఆలయ ఏవిఎస్ఒ రాజశేఖర్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో జరిగే ఆర్జితసేవలు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం రద్దయ్యాయి.

## సింహ వాహనంపై కోదండరాముడు



**తిరుపతి, మార్చి 19 ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతిలో ఉన్న కోదండరామస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో గురువారం ఉదయం సింహ వాహనంపై కోదండరాముడు భక్తులకు దర్శనమిచ్చారు. సింహ రూప దర్శనంతో శక్తులన్నీ చైతన్యవంతమవుతాయి. సోమరితనం నశించి పట్టుదలతో ప్రవర్తించి సర్వత్రా విజయులమై ఆధిపత్యంతో రాణించే స్ఫూర్తి సిద్ధిస్తుంది. అజ్ఞానంతో ప్రవర్తించే దుష్టులను హరించడంలో నేను, నా వాహనమైన సింహం సమాన ప్రయత్నంతో ఉంటామని ఈ సింహ వాహనం ద్వారా స్వామివారు నిరూపిస్తున్నారు. అనంతరం ఉదయం 10.30 నుండి 11.30 గంటల వరకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు, చందనంలతో ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా అర్చకులు నిర్వహించారు. రాత్రి 7 గంటలకు శ్రీరామచంద్రమూర్తి ముత్యపు పందిరి వాహనంపై విహరించి భక్తులను కనువిందు చేశారు. ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న,ఆలయ ఇన్‌స్పెక్టర్లు సురేష్ బాబు,హరి కృష్ణ, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## టిటిడి ట్రస్ట్‌లకు రూ.17.55 లక్షలు విరాళం



**తిరుమల,మార్చి 19ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మికసంస్థ తిరుమలతిరుపతిదేవస్థానం నిర్వహిస్తున్న పథకాలు, ట్రస్ట్‌లకు దాతలు విరాళాలందిస్తున్నారు. గురువారం ఉగాది పర్వదినం పురస్కరించుకుని ఇద్దరు దాతలు తమవంతుగా 17.55 లక్షలు రూపాయలు విరాళమిచ్చారు. హైదరాబాద్ వాసి మధుశేషు టిటిడి శ్రీవేంకటేశ్వర గో సంరక్షణ ట్రస్ట్‌కు 12.55లక్షలు , హైదరాబాద్ కు చెందిన ఆలపాటి సత్యదేవ్ బర్డ్ ట్రస్టుకు ఐదు లక్షలు రూపాయలు విరాళంగా అందించారు. దాతల తరఫున టిటిడి బోర్డు సభ్యుడు నన్నపనేని సదాశివరావు శ్రీవారి ఆలయంలోని రంగ నాయకుల మండపంలో టిటిడి ఇఒ ముద్దాడ రవి చంద్రకు విరాళాలడీడీలను అందజేశారు.


## భక్తులకు మెరుగైన సౌకర్యాలకు మీరే సూత్రదారులు

**- సేవకుల సూచనలు అమూల్యమన్న టిటిడి ఇఒ ముద్దాడ**



**తిరుమల, మార్చి 19 ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమలకు విచ్చేస్తున్న భక్తులకు నిస్వార్థంగా సేవలందిస్తున్న శ్రీవారి సేవకులు భక్తుల సౌకర్యాల మెరుగుదలకు మీ సూచనలు కూడా ఇవ్వాలని టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర కోరారు. భక్తులకు ప్రత్య క్షంగా సేవలందించే సేవకులు వారి సమస్యలను బాగా అర్థం చేసుకోగలరని, అందువల్ల వారు అందించే సూచనలు ఎంతో విలువైనవని ఇఒ పేర్కొన్నారు. ఉగాది పర్వదినం వేళ గురువారం మధ్యాహ్నం తిరుమలలోని శ్రీవారి సేవా సదన్ 2ను తొలిసారిగా సందర్శించారు. అక్కడ ఉన్న శ్రీవారిసేవకులకు ముందుగా ఇఒ రవిచంద్ర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు.అక్కడ సేవకులతో సమావేశమై అన్నప్రసాదం, పరిశుభ్రత, క్యూలైన్ నిర్వహణ తదితర అంశాలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. సేవకులు అందించే అమూల్యమైన సూచనలు,సలహాలు అభిప్రాయాలు భక్తుల సౌకర్యాల అభివృద్ధికి, వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడానికి కీలకంగా ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు.అంతకుముందు ఇఒ సేవా సదన్ 2లోని రిసెప్షన్, వెరిఫికేషన్, రిజిస్ట్రేషన్ కౌంటర్లను సందర్శించి, సేవకులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. హాల్స్‌ను తనిఖీ చేశారు. అక్కడ కొంతమంది సేవకులతో మాట్లాడి అందుతున్న సౌకర్యాలపై ఆరా తీయగా సేవకులు సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో టిటిడి సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి ,పిఆర్ఒ నీలిమ, శ్రీవారి సేవ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## ఉగాది పర్వదినాన శ్రీవారి దర్శనం సంతోషం: ప్రముఖులు



**తిరుమల,మార్చి 19ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని, ప్రజలు సంతోషంగా ఉండాలని స్వామివారిని ప్రముఖులు వేడుకున్నారు. తెలుగునూతన సంవత్సరం పరాభవనామ ఉగాది పర్వదినాన గురువారం ఉదయం సినీనటుడు సప్తగిరి, సినీనిర్మాత వెంకటేశ్, బన్నీవాసు, కర్నాటక నటుడు కిచ్చాసుదీప్, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్ కుటుంబసభ్యులతో కలసి వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## అన్నప్రసాదాలకు రూ.20లక్షలు విరాళం



**తిరుమల,మార్చి 19ప్రభాతవార్తప్రతినిధి:** నిరంతరాయంగా అందిస్తున్న అన్నప్రసాదాల ట్రస్ట్‌కు దాత తనవంతుగా 10లక్షలు, అలాగే ప్రాణ దానట్రస్ట్‌కు మరో 10లక్షలు రూపాయలు చెక్కులను గురువారం ఉదయం హైదరాబాద్ కు చెందిన సృజన్ జ్యూవెలరీ అధినేత రవికుమార్ టిటిడి చైర్మన్ బీ.ఆర్.నాయుడును కలసి అందజేశారు.

## శ్రీవారి సేవలో ప్రేమలత విజయ్‌కాంత్

**తిరుమల,మార్చి 19ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు నూతన సంవత్సరం ఉగాది పర్వదినాన గురువారం ఉదయం సినీనటుడు విజయ్‌కాంత్ సతీమణి ప్రేమలత విజయ్‌కాంత్ తిరుమలకు వచ్చారు. ఆమె ఉదయం కుటుంబంతో కలసి విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకున్నారు.

వార్త

మనిషి అన్నవాడు ముందు ఆత్మాభిమానం కలిగి ఉండాలి. ఆత్మాభిమానం లేనివాడు అసలు మనిషిగా ఎదగలేడు.

-పాస్కల్

# భూగర్భ జల సంక్షోభం?

నీటిని నీలి బంగారం అంటారు. వాస్తవంగా చెప్పాలంటే అసలు బంగారం కన్నా నీలిబంగారమే అత్యంత విలువైనది. గొంతు తడారిపోతున్న వ్యక్తికి కావాల్సింది గుక్కెడు నీళ్లే తప్ప బండెడు బంగారం కాదు. దురదృష్టం ఏమిటంటే ప్రధానంగా దేశంలో మంచినీరు గగనమైపోతున్నది. గత దశాబ్దకాలంగా వానలు సమృద్ధిగా కురుస్తున్నా కొన్ని చోట్ల కుంభవృష్టి వానలకు, వరదలకు పొంగిపొరులుతున్నా వేసవి వచ్చేసరికి నీటి కష్టాలు ఇబ్బడిముబ్బడిగా ఏర్పడుతున్నాయి. మార్చి మొదట్లోనే తెలుగు రాష్ట్రాల్లో నీటి కష్టాలు ఆరంభమయ్యాయి. భూగర్భజల మట్టాలు దిగజారిపోతున్నాయి. యేటేటా భూగర్భజలాల వినియోగం పెరిగిపోతుందనేందుకు ఊహించని రీతిలో కొత్తగా తవ్వుతున్న బోరుబావులను ఉదహరించవచ్చు. భూగర్భజలాల వాడకం ఎనభైశాతానికిపైగా వ్యవసాయానికి, పదిహేనుశాతం పరిశ్రమలకు, తాగునీటి అవసరాలు తీర్చుకోవడానికి వినియోగించుకుంటున్నారు. వినియోగం నానాటికీ పెరిగిపోతున్నా ఆ మేరకు భూగర్భజలాల పెంపునకు గట్టి ప్రయత్నాలు జరగడం లేదు. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశవ్యాప్తంగా భూగర్భజలాల వినియోగం అంతకంతకు పెరిగిపోతున్నది. మరోకపక్క గోదావరి, కృష్ణా, గంగా, కావేరి యమునా లాంటి జీవ నదుల నుండి కోట్లాది ఎకరాలకు సరిపడే నీరు నిరుపయోగంగా సముద్రంపాలవుతున్నది. ప్రపంచంలో ఎక్కడలేని విధంగా యేటా దాదాపు మూడు వందల ఘనపు కిలోమీటర్ల మేర భూగర్భజలాలు దేశంలో వినియోగించుకుంటున్నట్లు అంచనా. భారతదేశంలో ఆరువేల ఐదువందల డెబ్బైరెండు భూగర్భజలాల బ్లాక్లు ఉండగా వాటిలో మూడోవంతు బ్లాకుల్లో అవసరానికి మించి భూగర్భజలాలు దోడేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే మిగిలిన బ్లాకుల పరిధిలోకి చేరుకొని భూగర్భ జలాలు మరింతగా అడుగంటిపోతాయి. దేశంలో బోరుబావుల సంఖ్య గత అరవైయేళ్లలో దాదాపు నూటయాభై రెట్లకుపైగా పెరిగింది. ఇంకా పెరుగుతూనే ఉన్నది. యేటా వేలాది బోరుబావులు కొత్తగా తవ్వుతున్నారు. ఇందువల్ల సన్నకారు, చిన్నకారు రైతులు లాభపడిన మాట వాస్తవమే. కానీ నీటిసంరక్షణ పద్ధతులు పాటించకుండానానాటికీ బోరుబావులు అధికంగా ఆధారపడే పరిస్థితి అనేక అనర్థాలకు దారితీస్తున్నదని భూగర్భనిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూగర్భజలాలను వృథా చేయడం కూడా పెద్దఎత్తునే జరుగుతున్నది. ఇదే పరిస్థితికొనసాగితే మరో రెండు దశాబ్దాల్లో దేశవనరుల్లో అరవైశాతానికిపైగా హరించుకుపోతాయని ప్రపంచబ్యాంకే గతంలో హెచ్చరించింది. దేశ రాజధాని ఢిల్లీతోపాటు పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, తదితర రాష్ట్రాల్లో యేటా నలభైలక్షల కోట్ల లీటర్ల మేర భూగర్భజలాలు తోడేస్తుండడంతో సముద్ర మట్టాల్లో దాదాపు ఐదు శాతం పెరుగుదల నమోదైందని గతంలో జరిపిన ఒక అధ్యయనంలో వెలుగుచూసింది. ఇంకొకపక్క దేశంలో అధికశాతం జిల్లాల్లో భూగర్భ జలాలు తాగుయోగ్యమైనవి కావని కేంద్రమే గతంలో అంగీకరించింది. పార్లమెంట్లోనే గతంలో ఒక ప్రశ్నకు సమాధానం చెబుతూ అందించిన వివరాల ప్రకారం రెండువందల యాభైనాలుగు జిల్లాల్లో భూగర్భజలాల్లో ఇనుము, 224 జిల్లాల్లో ఫ్లోరైడ్, 162 జిల్లాల్లో క్షరాత 34 జిల్లాల్లో పాషాణం స్థాయి అధికంగా ఉన్నదని వెలుగు చూసింది. రాజస్థాన్, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల్లో మరింత తీవ్రంగా ఉంది. ప్రధానంగా పాషాణం లాంటి లోహాలను తొలగించడం కష్టంగా మారుతుందని అధికార వర్గాలే అంగీకరిస్తున్నాయి. ఉచిత విద్యుత్ సరఫరా కూడా బోరుబావుల సంఖ్య పెరగడానికి కారణమవుతున్నది. చట్టాలు, నిబంధనలు ఎన్ని ఉన్నా అంతగా అమలు కాకపోవడం మరో కారణంగా చెప్పవచ్చు. కొన్ని పరిశ్రమలు ప్రధానంగా శీతలపానియాలు, మద్యం తయారీ కంపెనీలు భారీ స్థాయిలో భూగర్భజలాలను వినియోగించుకుంటున్నాయి. ఇంకొకపక్క దేశవ్యాప్తంగా మున్సిపాలిటీల్లో వాడకం పెరుగుతున్నది. అదే స్థాయిలో వృధాకూడా అదుపు లేకుండా పోతున్నది. పాలకుల్లో చిత్తశుద్ధి, ప్రజల్లో అవగాహన లోపం కారణంగా భూగర్భజలాల సమస్య రోజురోజుకు తీవ్రరూపం దాలుస్తుందనే విమర్శలను కొట్టివేయలేం. మంచి నీటి కొరతను ముందుగానే గ్రహించి దాన్నిసొమ్ము చేసుకునేందుకు మొదలు పెట్టిన నీటి వ్యాపారం ఇప్పుడు నగరాలు, పట్టణాలు దాటి శివారు పల్లెలకు కూడా చేరుకున్నది. దేశంలో కోట్లాది రూపాయల నీటి వ్యాపారం జరుగుతున్నది. తెలంగాణ ప్రభుత్వం గతంలో మిషన్ కాకతీయ కార్యక్రమంద్వారా చెరువుల, కుంటల్లో పూడికలు తీయించి మరమ్మత్తులు చేయించడంతో ఆయా ప్రాంతాల్లో భూగర్భజలాలు కొంతమేరకు పెరిగాయని చెప్పొచ్చు. కానీ వాడుతున్న భూగర్భజలాల మట్టాలను భర్తీ చేయలేకపోతున్నాం. అందుకే వేసవిలో తెలుగు రాష్ట్రాల్లో కూడా భూగర్భజలాల మట్టాలు గణనీయంగా పెరిగిపోతున్నాయి. తాగునీటి సంగతి దేవుడెరుగు. గుక్కెడు మంచి నీళ్ల కోసం వేసవిలో కోట్లాదిమంది ప్రజలు పడరానిపాట్లు పడుతున్నారు. దాహం తీర్చుకునేందుకు అందుబాటులో ఉన్న కలుషిత నీరు తాగి రోగాలబారిన పడుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా ఇప్పటికీ ప్రజలందరికీ కనీస అవసరమైన గుక్కెడు స్వచ్ఛమైన మంచినీరు అందించలేని దురదృష్టపు పరిస్థితుల్లో ఉన్నాం. ఇప్పటికైనా పాలకులు ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని చర్యలు చేపట్టాలి. అన్నింటికంటే ముఖ్యంగా చట్టాలు చేసి అవి అమలైపోతాయను కుంటే సరిపోదు. ఆ చట్టాలను క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు అవసర మైన సిబ్బందిని నియమించి పటిష్టమైన ప్రణాళికలతో పర్యవేక్షణ చేయాలి.

# విద్యావాక్కులో జాతీయ విధాన వ్యూహాలు!

**ప్రతి విద్యార్థి తరగతి వారీ అభ్యసనా సామర్థ్యాలు సాధించడానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకొని సామర్థ్యాలలో వెనుకబడి ఉన్న కనీసం 40శాతం మంది విద్యార్థులు కోసం ప్రత్యేక వ్యూహాలతో సిలబస్‌పూర్తి చేయడమనే లక్ష్యంకన్నా తరగతి గదిలో అభ్యసనలో వెనుకబడ్డ విద్యార్థులను తీర్చిదిద్దడానికి కంకణం కట్టుకోవాలి. అప్పుడే నూతన విద్యా విధాన ప్రధాన భూమికగా వర్ణించే సమ్మిళిత విద్యా సాధనా లక్ష్యం నెరవేరుతుంది. విద్యా హక్కు చట్టం 2009లో పొందుపరచిన బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందుబాటులోనికి తీసుకురావడానికి మౌలిక వసతుల కల్పన, ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాల పెంపు తక్షణమే జరగాలి.**

మల్లాడి శ్రీనగేష్

దేశంలో 6-14 వయసు కలిగిన విద్యార్థుల పాఠశాల నమోదు గత రెండు దశాబ్దాల నుండి 95 శాతంకాగా ప్రస్తుతం 98.1 శాతంగా నమోదు కావడం చాలా శుభ పరిణామం అంటే 2018 తో పోల్చుకుంటే 2024 నాటికి నమోదు శాతం 66.8శాతం పెరిగినట్టు చెప్పవచ్చు. ఒకప్పుడు ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల నమోదు లేక సతమతమోతూ ఉంటే ప్రభుత్వ ప్రయత్నాలు తలిదండ్రుల ఉత్సుకత, ఎలిమెంటరీ స్థాయివరకు ఉచిత నిర్బంధ విద్యకు కంకణం కట్టుకున్న విద్యా హక్కు చట్టం 2009 వెరసి బడిబయట వున్న బడిఈడు పిల్లలను కూడా పరిగణనలోనికి తీసుకొని లెక్కిస్తే పిల్లల నమోదు సుమారు 98.1 శాతం వరకు చేరినట్టు గణాంకాలు చెబుతున్నాయి. పిల్లల చేరిక సరేవారి రేటెన్షన్ (తరగతిగదిలో నిలుపుదల), నాణ్యమైన విద్య అభ్యసనా సామర్థ్యాల సాధన సమ్మిళిత విద్యలో ప్రధాన భూమికగా చెప్పవచ్చు. సమ్మిళిత విద్యా లక్ష్యాలను సాధించాలంటే, పాఠశాల యాజమాన్యాలు తమతమ పాఠశాల బోధనా వ్యూహాలను ప్రత్యేకించి రచించుకోవాలి. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలు తమ పాఠశాలలకు విద్యార్థుల నేపథ్యాలను పరిగణనలోనికి తీసుకొని పాఠ్య ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలి. ఉపాధ్యాయులు తరగతి నిర్వహణలో తాను అవలంబించాల్సిన వ్యూహాలను స్థానికతను, విద్యార్థుల మాతృభాష, సంస్కృతి, కుటుంబ నేపథ్యం, ఆర్థిక సామజిక విషయాలను పరిగణనలోనికి తీసుకొని అభ్యసనలో విద్యార్థులకు ఎదురౌతున్న సమస్యలను పరిశీలించి విద్యార్థి ఆధారిత బాటలో తరగతి నిర్వహణజరగాలి. సమ్మిళిత విద్య అనగానే ఒక దివ్యంగులైన విద్యార్థులే కాకుండా పాఠశాలకు వచ్చే వివిధ ఆర్థిక, సాంఘిక, సామాజిక నేపథ్యాల నుండి పాఠశాలకు వచ్చేవిద్యార్థుల అభ్యసనా ప్రక్రియలో ఎదురౌతున్న సమస్యలను తద్వారా పాఠశాల లేదా ఉపాధ్యాయుడు అనుసరించాల్సిన వ్యూహాలనుతప్పక పరిగణనలోనికి గణనలోనికి తీసుకోవాలి. తద్వారాసమ్మిళిత విద్యా లక్ష్యాలను సాధించాలి. నాణ్యమైన సమాన విద్యను అందించడం, పాఠశాలలో చేరిన విద్యార్థులందరికి సమాన స్థాయిలో అనగా కుల, వర్గ, మత, లింగ, భాష, ప్రాంతీయ, ధనిక, పేద, గ్రామ, పట్టణ, సామాజిక వ్యత్యాసం, దివ్యాంగులు లేదా ఎటువంటి సామాజిక పరమైన వివక్ష లేకుండా అందరికి కావలసిన వసతులు, బోధనావ్యూహాలను రచించి సమాన విద్యనందించడమేనని అందరూ గ్రహించాలి. కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన నూతన విద్యా విధానం నిజమైన స్ఫూర్తితో రూపుదాలిస్తే దేశంలో పిల్లలు ఎదుర్కొంటున్న అభ్యసనా సామర్థ్యాల సవాళ్లకు ఒక సమాధానమే కాక ఉన్నత విద్యలో విద్యార్థులు సులభంగా తాము అనుకున్న విద్యా లక్ష్యాలను సాధించడానికి తద్వారా దేశం సమ్మిళిత విద్యా చట్రంలో పొందుపరచిన వివిధ నేపథ్యాల నుండి పాఠశాలకు వచ్చే విద్యార్థులకు అందరికీ నాణ్యమైన సమాన విద్యా సామర్థ్యాలు సమకూర్చడానికి సానుకూలత ఏర్పడుతుంది. అంతేకాక ప్రభుత్వం విద్యార్థి తన మాతృ భాషలో చదువుకొనే వెసులుబాటు కల్గించడం అంటే విద్యార్థి ప్రాథమిక ఉన్నత విద్యవరకు తాను మాతృభాషలోచదుకొనే అవకాశం ఏర్పరచింది. ఆంగ్లం లేదా స్థానిక భాషలోనే చదవాలనే నిబంధన లేకుండా ఆయా రాష్ట్రాలు భాషా బోధనలో తన నిర్ణయం తీసుకొనే వెసులుబాటు కూడా కల్పించింది. దీనికితోడు విద్యార్థికి పటిష్టమైన పునాది ఏర్పరచడానికి ప్రాథమిక స్థాయిలో ఫౌండషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ కార్యక్రమాన్ని బలోపేతం చేయడం ద్వారా ప్రాథమిక పాఠశాలల్లో 2026-27వ సంవత్సరానికి విద్యార్థి మూడువతరగతికి చేరే నాటికే అవగాహనతో చదవడం, రాయడం గణిత సామర్థ్యాలు సాధించడం తద్వారా ఎలిమెంటరీ స్థాయికి విద్యార్థి చేరేనాటికి ప్రతి విద్యార్థి తమ తరగతి స్థాయి




విద్యా సామర్థ్యాలు సాధించడం, ఉపాధ్యాయులను తదనుగుణంగా అన్ని స్థాయిల్లోనూ తగిన నైపుణ్యాలతో సంసిద్ధం చేయడం సమ్మిళిత విద్యా లక్ష్యసాధనలో నూతన విద్యా విధాన ప్రధాన భూమికయని చెప్పవచ్చు. ఈ ప్రక్రియలో పాఠశాలలు తమపాఠశాలకు వచ్చే ప్రతి విద్యార్థి నేపథ్యాన్ని, పరిగణలోకి తీసుకోవడం, తదనుగుణమైన బోధనా వ్యూహాలను రచించుకోవడం, తరగతిని బైల్స్ ఫ్రెండ్లీ తరహాగా తీర్చిదిద్దడం, భారంలేని విద్యను అందించడం ద్వారా జాతీయ విద్యాచట్రం (నేషనల్ కరికులం ఫ్రేంవర్క్) ప్రధాన లక్ష్యం నెరవేరుతుంది. దీనికి ప్రధానంగా విద్యావ్యవస్థలో వున్న వివిధ విభాగాలు ఉమ్మడిగా అకడమిక్ అభ్యున్నతికి కృషి చెయ్యాలని నూతన విద్యా విధానం సమ్మిళిత విద్యా సాధనకు ప్రధాన భూమికగా నిర్వచించింది. ఇక సమ్మిళిత విద్యాలక్ష్యాలను పరిశీలిస్తే పిల్లల సామర్థ్యాలు, వారు నేర్చుకొనే నేపథ్యంలో ఎదుర్కొంటున్న సమస్యలను ప్రతి పాఠశాల యాజమాన్యం తప్పక పరిగణనలోనికి తీసుకోవాలి. అనగా సమ్మిళిత విద్య అనగానే ఒక దివ్యంగులైన విద్యార్థులే కాకుండా పాఠశాలకు వచ్చే వివిధ ఆర్థిక, సాంఘిక, సామాజిక నేపథ్యాలనుండి పాఠశాలకు వచ్చే విద్యార్థుల అభ్యసనా ప్రక్రియలో ఎదురౌతున్న సమస్యలను తద్వారా పాఠశాల లేదా ఉపాధ్యాయుడు అనుసరించాల్సిన వ్యూహాలను తప్పక పరిగణనలోనికి తీసుకోవాలి. తద్వారా సమ్మిళిత విద్యా లక్ష్యాలను సాధించాలి. 'సమ్మిళిత విద్య' అంటే సమాజంలో వుండే పిల్లలందరినీ ఒకే గొడుగు క్రింద ఉన్న పాఠశాలలో చేర్చి నాణ్యమైన, సమాన విద్యను అందించడం అనివార్యం. ఈ దిశగా అన్ని పాఠశాలలు తగిన వ్యూహాలను రచించడం అందుకు ఉపాధ్యాయులను సుశిక్షితులుగా తీర్చిదిద్దడం పాఠశాల యాజమాన్య ప్రధాన పాత్రగా గ్రహించాలి. వాస్తవాలు పరిశీలిస్తే సుమారు 40 శాతం మంది విద్యార్థులు ఇప్పటికీ అభ్యసనా లేమితో సతమవుతున్నట్టు అనేక నివేదికలు చెబుతున్నాయి. ప్రాథమిక స్థాయి నుండి పునాది లేకుంటే భవిష్యత్తరాలు ఉన్నత విద్యాభ్యాసంలో కూడా సరైనప్రగతి గడించలేని పరిస్థితి పునరావృతమౌతుందని నిపుణులు వక్కాణిస్తూనే వున్నారు. ఇప్పటికే 8వ తరగతిలో ప్రవేశించినప్పటికీ విద్యార్థులు ఒక పేరా కూడా తడబడకుండా తప్పులు లేకుండా చదవలేకపోతున్నారు అంటే ఆ కోవకు చెందిన విద్యార్థులు చదువు కాలమంతా ఒక విష వలయంలోనే చిక్కుకుపోతున్నారు. ఈ పరిస్థితిలో పదవతరగతిలో ప్రవేశించే నాటికి పాఠశాలలు 80శాతం ఉతీర్ణత సాధిస్తున్నారు. ఈ మధ్యనే ఎస్.సి.ఆర్.టి నిర్వహించిన ఫరక్ రాష్ట్రీయ సేవ్‌క్షన్ సర్వే ప్రకారం సుమారు ప్రకారం సుమారు 75శాతం మంది 9 వ తరగతి విద్యార్థులు తరగతి విద్యార్థులు చిన్నచిన్న కాన్సెప్ట్‌లను కూడా అర్థం చేసుకోని దుస్థితిలో ఉన్నారు. అంతేకాక చిన్నచిన్న గణిత సంబంధిత సమస్యలను కూడా చేయలేని పరిస్థితిలో ఉన్నారు. ఫరక్ రాష్ట్రీయ సేవ్‌క్షన్ సర్వేలో ముందంజలో వున్న పంజాబ్, కేరళ, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలను ప్రగతి సాధనలో వారు రచించిన వ్యూహాలను అధ్యయనం చేయలేమా? దేశంలో సుమారు 47శాతం 3వ తరగతి విద్యార్థులు చిన్నకథను కూడా చదివి అర్థం చేసుకోలేని స్థితిలో వున్నారు. 36శాతం మంది విద్యార్థులు కూడికలు కూడా చేయలేకపోయారు. 6 వ తరగతిలో సుమారు 34శాతం మంది స్థానిక సంస్థలు, మార్కెట్ ఇతర సంస్థల పని గురించి కుడా తెలియపరచలేకపోయారు. 9వ తరగతి విద్యార్థులు సుమారు 55శాతం మంది సోషల్ స్టడీస్ సబ్జెక్టులో రాజ్యాంగం గురించి, వాటి సూత్రాలు జాతీయ ఉద్యమాల గురించి వెల్లడించలేని పరిస్థితిలో వున్నారు. ఈ పరిస్థితులను చక్కదిద్దడానికి, ప్రతి విద్యార్థి తరగతి వారీ అభ్యసనా సామర్థ్యాలు సాధించడానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకొని సామర్థ్యాలలో వెనుకబడి ఉన్న కనీసం 40శాతం మంది విద్యార్థులు కోసం ప్రత్యేక వ్యూహాలతో సిలబస్‌పూర్తి చేయడమనే లక్ష్యంకన్నా తరగతి గదిలో అభ్యసనలో వెనుకబడ్డ విద్యార్థులను తీర్చి దిద్దడానికి కంకణం కట్టుకోవాలి. అప్పుడే నూతన విద్యా విధాన ప్రధాన భూమికగా వర్ణించే సమ్మిళిత విద్యా సాధనా లక్ష్యం నెరవేరుతుంది. విద్యా హక్కు చట్టం 2009లో పొందుపరచిన బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందుబాటులోనికి తీసుకురావడానికి మౌలిక వసతుల కల్పన, ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాల పెంపు తక్షణమే జరగాలి. 21వ శతాబ్దపు నైపుణ్యాలను పుణికి పుచ్చు కొనేలా విద్యా వ్యవస్థను బలపరచాలనేదే మూల సూత్రంగా, ఉండాలి. ఈ విద్యా విధాన అమలులో ప్రభుత్వం, ప్రభుత్వేతర సంస్థలు తలిదండ్రులు పాఠశాల యాజమాన్యాలు కలసికట్టుగా కృషి చేయడమే మనందరి ముందున్న ప్రధాన కర్తవ్యం. ●

# యుద్ధాలతో తల్లడిల్లుతున్న ప్రపంచం

కనుమ ఎల్లారెడ్డి


నేడు విశ్వం యుద్ధాలతో చాలా భయానక వాతావరణం తలపిస్తోంది. రష్యా, ఉక్రెన్ యుద్ధం ఒక ప్రక్క సాగుతుండగా, మరోప్రక్క ఇజ్రాయెల్, అమెరికా దేశాలు సంయుక్తంగా ఇరాన్‌పై దాడులతో భయకంపితుల్ని చేస్తోంది. ఇరాన్‌లో అంతా మరు భూమిని తలపిస్తోంది. అమెరికాకు తోడుగా బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ తోడుగా నిలిచాయి. ఇరాన్ ప్రక్క హెజ్‌బొల్లా, ఇరాకీ మిలిషియా అండగా నిలిచాయి. ఇవి లెబనాన్‌లోని తీవ్రవాద సంస్థలు. ఇందులో హెజ్బొల్లా భయంకరమైన సంస్థ. ఆకస్మాతుగా ఇజ్రాయెల్‌పై దాడి చేసింది. ఈదాడులు ఇజ్రాయెల్ తిప్పి కొట్టినా నష్టం జరిగిపోయింది. ఇలా దాడులు, ప్రతి దాడులతో విశ్వం అతలాకుతల మవుతోంది. ఆయా దేశాలలోని పౌరులు ఏ క్షణనా ఏమి జరుగుతుందో అని బిక్కుబిక్కుమంటున్నారు. ఇప్పుడు రష్యా, ఉక్రెన్ యుద్ధం కంటే ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు ఎక్కువగా చర్చించుకుంటున్నారు. అటు ఇరాన్ కూడా వెనక్కి తగ్గడం లేదు. ఈ పరస్పర దాడులతో మధ్యలో కువైట్, సౌది, ఖతార్ తీవ్రంగా నష్టపోతున్నాయి. ఫలితంగానే సౌదిలోని ఆరామ్‌కొ చమురు కేంద్రంపై ఇరాన్ దాడి చేసి తీవ్ర నష్టం కలిగించింది. ఇలా పరస్పర దాడులతో ఏం సాధిస్తాయో అర్థం కావడం లేదు. అసలు తప్పంతా అమెరికా, ఇజ్రాయెల్ దాడులతోనే వచ్చింది. ముందు నుంచి ఇరాన్‌ను మెత్తగా మచ్చిక చేసుకుని మీ అణు స్టావరాలు వాటిలోని నిల్వలను ధ్వసం చేసివుంటే ఏ తగాదా ఉండేది కాదు. దీనికి తోడు ఇరాన్ భద్రత మండలి సెక్రటరీ మేము చర్చలకోసం ప్రయత్నం చేయడం లేదు అనడం గమనార్హం. ఒక విధంగా చుస్తే ఖుమేని లక్ష్యంగా ఇది కొనసాగింది. ఇజ్రాయెల్ అత్యంత సాంకేతికతతో 'మోసద్' అనే క్షిపణితో ఇరాన్ అధినేతను మట్టు పెట్టింది. రంగంలోకి హెజ్బొల్లా రాకపోయి ఉంటే బాగుండేది. ఎందుకంటే ఏడాది క్రితమే ఇజ్రాయెల్, హెజ్బొల్లా మధ్య కాల్పుల ఒప్పందం జరిగింది. ఇదే విషయం లెబనాన్ చెప్పినా కూడా హెజ్బొల్లా వెన్నక్కి తగ్గలేదు. కాని ఖమేని మృతితో ఇజ్రాయెల్‌పై దాడి చేసింది. ఇప్పుడు యుద్ధం భీకర రూపం దాల్చుతోంది. ఇరాన్ దాడిలో ఇజ్రాయెల్, అమెరికాకు కూడా నష్టం వాటిల్లుతోంది. అయితే ఇవి ఆ దేశాలు లెక్కచేయవు. మొత్తం ఇరాన్ పూర్తిగా మరు భూమిగా మారాలనిఅమెరికా, ఇరాన్‌పై అత్యాధునిక ఆయుధాలు వినియోగిస్తోంది. ఇది ఇలాఉండగా ఇజ్రాయెల్ ప్రకటన మా దాడిలో ఇరాన్ పగ్గాలు చేపట్టిన ఆయాతుల్లా ఆలీ రెజా కూడా మరణించారని వార్త హల్‌చల్ చేసింది. అయితే ఇరాన్ దీన్ని ధ్రువీకరించలేదు. ఇలా దేశ నాయకులు చంపుకుంటూపోతే ప్రగతి ఏ దేశామైన ఏమి సాధించలేదు. ఈ యుద్ధాలతోనే వేగలేకపోతుంటే పాక్, ఆఫ్ఘానిస్థాన్ యుద్ధంమరో కోణంలో జరుగుతోంది. పాక్‌లోనిబెలూ చిస్థాన్ కూడా పాక్‌పై గుర్రుగా ఉంది. ఇప్పుడు దేశాల మధ్యశాంతి కావాలి, అంతర్జాతీయ చట్టాలు అన్నిదేశాలు పాటించాలి. శాంతిసంస్థ ఐక్యరాజ్యసమితి మధ్యవర్తిత్వంతో దేశాలు యుద్ధంముగించి శాంతి పరిమళాలుకురిపించాలి. ఇది ఏస్థాయికి పోతుందో చెప్పలేం. యుద్ధం ఆపడమా, చర్చలు చేయడమా అనేది నాయకులే తేల్చుకోవాలి. ●

మన సమస్యలకు పరిష్కారాలు మన దగ్గరే ఉంటాయి. కానీ మనం ఎవరో పరిష్కరించాలని అనుకుంటామంతే.



షేక్‌స్పియర్

ప్రతి వాడు ఒర్పుతో ఉండలేడు. అలా ఉన్నవాడే తనను తాను జయించగలడు.



మహాత్మాగాంధీ

## ప్రజావాక్కు



### విద్యార్థులకు విద్యుత్ స్కూటర్లు

తెలంగాణలో కళాశాలలకు వెళ్లే విద్యార్థినులకు విద్యుత్ స్కూటర్లు అందజేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం మహిళా సాధికారత దిశగా తీసుకున్న సానుకూల సంకల్పంగాభావించవచ్చు. తెలంగాణలో ఉన్నతవిద్యా వ్యవస్థ విస్తృతంగా ఉంది. ఈ నేపథ్యంలో ప్రతిరోజూ వేలాది విద్యార్థినులు పట్టణాలు, గ్రామాలనుంచి విద్యాసంస్థలకు ప్రయాణిస్తుంటారు. దేశంలో నిరక్షరాస్యులు, దినసరి కూలీలు అధిక సంఖ్యలో ఉన్న సామాజిక వాస్తవాన్ని కూడా పరిగణలోకి తీసుకోవాలి. అలాంటి కుటుంబాలకు చెందిన విద్యార్థినులకు విద్యుత్ స్కూటర్ అందించడం మాత్రమే సరిపోదు. వాహనం నడపడం నేర్చుకోవడం, లైసెన్స్ పొందడం, నిర్వహణ ఖర్చులు భరించడం వంటి అంశాలు వారికి భారంగా మారే అవకాశం ఉంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ఆన్‌లైన్ సర్వీసెస్‌లో సాంకేతిక లోపం

తెలంగాణ మీసేవ మొబైల్ యాప్‌లోని టెంపుల్ ఆన్‌లైన్ సర్వీసెస్ విభాగంలో ఆన్‌లైన్ సేవలు ట్యాబ్‌ఓపెన్ కావడంలేదు. ఈట్యాబ్ ద్వారా దేవాలయాలకు సంబంధించి నపూజా వివరాలు, సేవల సమాచారం ప్రజలకు అందుబాటులో ఉండాల్సి ఉంది. కానీ ప్రస్తుతం ఈ లోపం కారణంగా అనేక మంది భక్తులు, వినియోగదారులు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు. కావున, సంబంధిత అధికారులువెంటనే స్పందించి ఈ సాంకేతిక సమస్యను తక్షణమే పరిష్కరించి, మీసేవ యాప్ అన్ని విధాలుగా సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలి.

- సి.వి.ఆర్ కృష్ణ, హైదరాబాద్

### నసమస్యలను వెంటనే పరిష్కరించాలి

ఏపిలోని అన్ని జిల్లాల కేంద్రాల్లో ప్రజల ఫిర్యాదులు వివిధ శాఖలకు సంబంధించి ప్రత్యక్షంగా జిల్లా మేజిస్ట్రేట్, కలెక్టర్ వారు స్వీకరణ చేస్తూ వారికి రసీదు ఇవ్వడం ఎంతో తృప్తికరం. వారు సమస్య స్థితిని వ్యక్తంచేయడం కూడాకొంతఉపశమనంఉంటుంది. ఐతే ఫిర్యాదుల సంఖ్య శాఖలవారీ ప్రకటనతోపాటు, దీర్ఘకాల సమస్యలకు పరిష్కారానికి హెచ్చుప్రాధాన్యత ఉంటుంది. పరిష్కారం జరిగిన కేసుల సంఖ్య పెరిగిన కొద్దీ ప్రజలు సంతోషం, పాలనపై విశ్వాసం ధృఢమవుతుంది.

- బొల్లోజు మేఘనాదం, విశాఖపట్నం

### గ్యాస్ రేట్ల పెరుగుదల

ప్రస్తుత సమాజం ఎలా ఉందంటే అపోహలు సృష్టించడంలో మనస్సు కన్నా వేగంగా వ్యాప్తిచేస్తారు. సిలిండర్ గ్యాస్ కొరత పేరుతో హోటళ్లు, రెస్టారెంట్ల యజమానులు రేట్లు పెంచి సాధారణ మానవుడి నడ్డి విరుస్తున్నారు. గ్యాస్ సరఫరా ఎలా ఉన్న రెట్లు మాత్రం పెంచారు. ఎప్పుడైనా పరిస్థితుల దృశ్య రెట్లు పెంచడమే కానీ తగ్గించడం మాత్రం అస్సలు ఉండదు కదా. ఇలాంటిది అమాంతం రెట్లు పెంచడం అనేది ప్రభుత్వాల చేతుల్లో లేదా అధికారుల చేతిలో ఉండాలి గాని యాజమానుల ఇష్టారీత్య ఉండకూడదు. అధికారుల నిర్ణయ ప్రకారమే నడుచుకోవాలి. రేట్లు వినియోగదారుడు అదుపులో ఉండాలి. సామాన్యుడి నడ్డి విరిచేలా ఉండకూడదు.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### పూర్వ వైభవం రావాలి

ఒకనాడు తెలుగునాట పాడి పంటలు వెల్లివిరిసేయి. గ్రామాలలో నిత్యం పాలు, నెయ్యి, తేనెలు పుష్కలంగా లభించేవి. నదులలో నీరు నిండుగా ప్రవహించేవి. ఎప్పుడూ సిరిసంపదలతో విలసిల్లుతూ లలితకళలు నాట్యమాడేవి. శాతవాహన, ఇక్ష్వాక, కాకతీయ, విజయనగర సామ్రాజాల కాలంలో తెలుగుతేజం వెలుగొంది అనంత కీర్తిని ఆర్జించింది. ఆనాటి సిరిసంపదలను తిరిగి తెలుగు రాష్ట్రాలు సాధించాలి. ప్రజా జీవితాన్ని సౌభాగ్యవంతం చేయాలి. అప్పటి తెలుగుభాషను, కళాప్రాభవాన్ని పునః ప్రతిష్టించాలి. ఆ లక్ష్యసాధన కోసం రెండు తెలుగు రాష్ట్రాలు సహకరించుకుంటూ ముందుకు సాగితే పూర్వ వైభవం తథ్యం.

- కాయల నాగేంద్ర, హైదరాబాద్

### దివ్యాంగుల రైతుల సదస్సు నిర్వహించాలి

తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వ్యవసాయ భూమి యజమానులుగా ఉన్న రైతు దివ్యాంగుల సదస్సును రాష్ట్రస్థాయిలో నిర్వహించాలి. వైకల్యం అనేది శరీరాలకి కానీ ప్రతిభకుకాదు అని రైతు దివ్యాంగులు నిరూపిస్తున్నారు. రైతు దివ్యాంగులలో ఉన్నత విద్యా చదివిన రైతు దివ్యాంగులు ఉన్నారు. జనరల్ రైతులకు, మహిళా రైతులకు వేరువేరుగా రైతు సదస్సులు నిర్వహించినట్లుగానే ఈ సంవత్సరం నూతనంగా రాష్ట్రస్థాయిలో రైతు దివ్యాంగుల సదస్సును ఏర్పాటు చేయాలి. వీరికి ఉచితంగా వ్యవసాయ పరికరాలను, ఎరువులను, క్రిమిసంహారక మందులను సరఫరా చేయాలి. వీరికి ప్రత్యేకంగా రైతు గుర్తింపు కార్డులను ఇవ్వాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

గమనిక : ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# సమాజం బాగుపడాలంటే ఓటరు ఆలోచన మారాలి!

డాక్టర్ టి.సేవకుమార్

మనదేశంలో ఓటరు ద్వారా ఎన్నుకోబడిన రాజకీయ పార్టీల పరిపాలన వ్యవస్థలు ఏ విధంగా ఉన్నాయో ప్రతి ఒక్క ఓటరు విశ్లేషించుకోవలసిన అవసరం ఉంది. ప్రజాస్వామ్యయుత పార్లమెంటరీ పరిపాలన విధానంలో ఓటు విలువ నేడు చాలా మందికి తెలిసిందే. అయినా ఓటర్లు అనేక ప్రలోభాలకు లొంగిపోయి ఓటు హక్కును వినియోగించుకుంటున్నారనడంలో ఎంత మాత్రం సందేహం అక్కర్లేదు. నేడు ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థులుగాని, చిన్న పార్టీల అభ్యర్థులు గాని ఎక్కడా మూడు అంకెల ఓట్లైనా పొందిన దాఖలాలు కనబడవు. వీరిలో ఎంతమంచివారున్న, నిత్యసంఘ సేవకులు, నిజాయితీపరులు, నిస్వార్థపరులున్న, దేశం, రాష్ట్రం పాడైపోతున్నదన్న ఆవేదనతో, ఆందోళనతో సొంత డబ్బునే ఖర్చు పెట్టుకుని, ఎంత ప్రచారం చేసినా ఫలితాలు ఎంత అన్యాయంగా ఉంటున్నాయో ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. గతంలో దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా కొంతమంది అయినా స్వతంత్ర అభ్యర్థులు, స్థానిక పార్టీల అభ్యర్థులు గెలిచేవారు. చట్టసభలలో వారి గళం గట్టిగా వినిపించేవారు. ఈవేళ ఆ పరిస్థితులు లేవు. అందుకు గల కారణాలను నేడు ప్రతి ఒక్క ఓటరు విశ్లేషించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రస్తుత అధికార, ప్రతిపక్షపార్టీల పరిపాలన నేడు ఏ విధంగా ఉందో తెలిసికూడా వారు ఎలాంటి అభ్యర్థులను నిలబెట్టినా ఆ పార్టీలకే ఓటు వేయాలనుకోవడం ఎంతవరకు సమంజసమో ప్రతి ఓటరు ఆలోచించాలి. నేటి ఓటర్లు పార్టీలుగా, మతాలుగా, కులాలుగా విడిపోయి తమ విలువైన ఓటు హక్కును వినియోగించుకోవడం దేశానికి, రాష్ట్రాలకు ఎంత మాత్రం మంచిది కాదు. చదువుకున్న, విజ్ఞానవంతులైన వారు అనుకున్నవారు , ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పరిపాలన విధానాలపైస్పష్టమైన అవగాహన ఉన్నవారు కూడా ఆయా పార్టీల ప్రలోభాలకులోనై ఓటు వేయడం వల్ల ఇప్పుడు ఏమి జరుగుతుందో తెలుస్తోంది గదా! మధ్యతరగతి, పేదవారు ప్రత్యక్షంగా డబ్బు, మద్యం, సంక్షేమ పథకాల రూపంలో వారి బ్యాంకు ఎకౌంట్లో వేస్తున్న డబ్బులకు దాసోహమై ఓటు వేస్తుంటే వీరిని ఎవరు మార్చాలి? అభ్యర్థులు ఎన్నికలలో ఖర్చు పెడుతున్న కోట్ల రూపాయల ధనం, వారికి, బ్యాంకు ఖాతాలలో అధికారికంగా సంక్షేమ పథకాల పేరుతో వేస్తున్న ప్రజాధనం ప్రభుత్వానికి ఎక్కడి నుంచి వస్తుందో ఓటర్లకు తెలియదా? తెలుసుకోవలసిన అవసరం లేదా? కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు కూడా రాష్ట్ర, దేశ భవిష్యత్తు గురించి ఆలోచించకుండా తమ బాగోగుల విషయంలో అపరితమైన, అసాధ్యమైన హామీలు గుప్పించిన వారికే ఓట్లు వేస్తున్నారు. తర్వాత వాటిని అమలు చేయకపోతే ఉద్యమాలకు దిగుతున్నారు. ఓడిస్తామని బెదిరిస్తున్నారు. కానీ ప్రజాధనం నెల నెలా జీతంగా తీసుకుంటూ వారి ఉద్యోగ ధర్మంపై ఆధారపడ్డ ప్రజల పనుల విషయంలో ఏం చేస్తున్నారో తెలియనిది ఎవరికి? ప్రభుత్వ ఆఫీసుల్లో ఫైలు కదలాలంటే ఎన్ని పాట్లు పడాలో అనుభవం లేనిదిఎవరికి? ఇందుకుప్రభుత్వం



లో అత్యున్నత స్థాయిలో ఉండే బ్యూరోక్రాట్లు కూడా ఎంత మాత్రం అతీతులు కారు. అత్యధికులు రాజకీయ పార్టీలకు వత్తాసులుగా మారి ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. అంతేకాక ఓటర్లను తప్పుదారి పట్టిస్తున్నవారు కూడా కొందరు ఉంటున్నారు. అంతేకాక ప్రస్తుత పరిస్థితులలోచాలా మంది తమ ఓటు హక్కు వినియోగించుకోవడంపై రకరకాల వ్యాఖ్యానాలు చేస్తుంటారు. కథనాలు చెప్తుంటారు. కొందరు వివాదాలకూ దిగుతుంటారు. అభ్యర్థి ఎవరైనా సరే గెలిచే వారికే మేము ఓటు వేస్తాం. మా ఓటును ఆ విధంగానే సద్వినియోగం చేసుకుంటామని కొందరుఅంటే, మరికొందరు గెలవని వారికి ఓటువేస్తే మా ఓటు వృథా అవుతుంది అంటున్నారు. ఇంకొందరు ఎవరికి ఓటు వేసిన మనకు ఒరిగేది ఏమిలేదు. ఎవరో ఒకరికి వేస్తాం. లేకపోతే ఓటే వేయం అంటున్నారు. కొందరు ఆ పార్టీ ప్రభుత్వాన్ని పడగొట్టాలని, తమ పార్టీ వారినే గెలిపించుకోవాలని ఓట్లు వేసుకుంటామంటున్నారు. అంతేగాని మంచి పరిపాలన అందించే అభ్యర్థులకే ఓట్లు వేస్తామని చెప్పేవారు లేకపోవటం చాలా దురదృష్టకరం. ఇదే ఇప్పుడు ఈ దేశానికి పెట్టిన అతిపెద్ద దౌర్భాగ్యం. ప్రతి లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గంలలో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా(ఈసీఐ) గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర పార్టీలతో పాటు ఆయా రాష్ట్రాలలో రిజిస్టరైన, ఈసీఐ గుర్తింపు పొందని పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు మొత్తం మీద 30 నుంచి 40 మంది అభ్యర్థుల పేర్లు బ్యాలెట్ పేపర్లో ఉంటున్నాయి. అయితే అందులో ఒక పార్టీ అభ్యర్థిని గెలిపించేందుకు, ప్రత్యర్థి పార్టీ ఓట్లు చీల్చేందుకు పోటీ చేస్తున్న అభ్యర్థులు లేకపోలేదు. నిజానికి ఈ దశాబ్దాపు ఎన్నికలలో వీరి బెడద ఎక్కువగానే ఉందని చెప్పవచ్చు. ప్రధాన పార్టీలు తమ అభ్యర్థులకుపరోక్షంగాచేదోడు వాదోడుగా ఉండేందుకు కొందరు అభ్యర్థులను వివిధ చిన్న పార్టీల తరఫునగాని, స్వతంత్రంగా గాని పోటీకి దించుతున్నాయి. ఈ విధంగా మన ఎన్నికల వ్యవస్థ, రాజ్యాంగబద్ధ ఈసీఐ నిబంధనకు లోబడే ఎవరు ఏమి చేయలేని విధంగా 'వెర్రి తలలు' వేస్తోంది. ఎన్నికలపై విరక్తి చెందినవారు కొందరైతే, తమ వారినే గెలిపించుకోవాలని పట్టుదల గలవారు కొందరు. గతంలో ఓటర్లలో అత్యధిక శాతం మందిలో మంచిచెడుల విచక్షణ, సమాజ సమగ్ర అభివృద్ధి వంటి విశాల దృక్పథం ఉండేది. అందువలనే స్వతంత్ర అభ్యర్థులు, చిన్న పార్టీల అభ్యర్థులు ఎన్నికలలో విజయం సాధించేవారు. ఆరోజుల్లో అభ్యర్థిని చూసి ఓటు వేసేవారు. కనుకనే వారు గెలిచేవారు. నేడు ఎన్నికలలో అభ్యర్థిని చూడడమే మర్చిపోయారు. ఒకవర్గం ఓటర్లు కేవలం కులం, మతం, పార్టీకే ప్రాధాన్యత ఇచ్చి ఆయా అభ్యర్థుల ఎలాంటి వారైనా మాకేమి సంబంధం లేదని ఓట్లు వేస్తుంటే మరో వర్గం సంక్షేమ పథకాల పేరుతో ప్రభుత్వ ధనాన్ని వారి బ్యాంకుఖాతాలో నెలనెలా వేసేవారికి అందులోనూ ఎక్కువ మొత్తంలో వేసేవారికే ఓటు వేస్తున్నారు .ఇక మూడవ వర్గం డబ్బు, మద్యం వంటి ఆరోజు తాత్కాలిక తాయిలాలకు లొంగిపోయి ఓటేస్తున్నారు. దేశ, రాష్ట్రాల భవిష్యత్తు ఐదేళ్లకు ఒకసారి ఓటరు చేతిలోకి వస్తుంది. అప్పుడు ఆలోచించి, నిస్వార్థంగా ,కుల, మత ,పార్టీలకతీతంగా మంచి అభ్యర్థిని ఎంచుకొని ఓటుహక్కు వినియోగించుకుంటే దేశ భవిష్యత్తు, రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుంది. ఓటు మన ప్రజాస్వామ్యయుత పరిపాలన వ్యవస్థకు మూలాధారం. పునాది. కేవలం ఓటర్ల విచక్షణాయుత ఓటు హక్కు వినియోగంపైనే మన దేశ, రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్తు పూర్తిగా ఆధారపడి ఉంటుంది. అంటే మన దేశ భవిష్యత్తు మన దేశ పౌరుడైన ఓటర్ చేతుల్లో, చేతల్లోనే ఉంది. ●

# ఇంధన సంక్షోభం

- సౌదీ, ఖతార్ అతిపెద్ద రిఫైనరీలపై ఇరాన్ క్షిపణి దాడులు
- అమెరికా ప్రముఖుల ఇళ్లపై డ్రోన్ల కదలికలతో నిఘా అప్రమత్తం
- ఖతార్ చమురు హబ్‌పై ఇరాన్ దాడి: ట్రంప్ సీరియస్
- ఇలాగే కొనసాగితే ఇరాన్‌పై సైనిక చర్యకు దిగుతాం: సౌదీ అల్టిమేటమ్
- యుద్ధాన్ని మేమే ముగిస్తాం: రక్షణమంత్రి పీట్ హెగ్సెత్



**టెహ్రాన్, టెల్‌అవీవ్, వాషింగ్టన్, మార్చి 19:** మధ్యప్రాచ్యంలో యుద్ధం మరింత ఉధృతం అవుతోంది. ఇపుడు ఇరాన్ తన యుద్ధ వ్యూహాన్ని మార్చి గల్ఫ్‌దేశాల్లోని చమురు క్షేత్రాలపైనే దాడులుచేసింది. ఖతార్ జీవనాడి అయిన చమురుకేంద్రం, సౌదీలోని ఆరామ్‌కో కంపెనీపైనా మళ్లీ దాడులు చేసింది. ఇదిలా ఉంటే హార్ముజ్ సమీపం లోని క్షిపణి కేంద్రాలను ధ్వంసంచేసేందుకు అమెరికా ఇప్పటికీ తనవంతుగా బాంబులు కురిపిస్తూనే ఉంది. అంతేకాకుండా భూతల దాడులకోసం వేలాదిగా సైనికులను పంపిస్తోంది. ఇరాన్ తీరప్రాంతమే లక్ష్యంగా యుఎస్ తన సైనికబలగాలను తరలిస్తోంది. 120 నౌకలు ధ్వంసంచేసామని, 7800 లక్ష్యాలపై దాడులుచేసినట్లుగా అమెరికా సెంట్‌కామ్ చెపుతోంది. ఖతార్‌లోని అతిపెద్ద గ్యాస్‌క్షేత్రం రాస్ లఫాన్‌పై దాడిచేయడంతో ఇపుడు ప్రపంచదేశాలకు గ్యాస్ సరఫరాపై ఆందోళన వ్యక్తం అవుతోంది. ఇదే కొనసాగితే ఇక ఇరాన్‌పై సైనికచర్యలు చేపడతామని సౌదీ అరేబియా ఇప్పటికే హెచ్చరికలు పంపించింది. అమెరికాకు సహకరించే ఎలాంటి దేశం అయినా తమకు శతృవేనని ఇరాన్ చెపుతోంది. అందుకోసమే గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలే లక్ష్యంగా దాడులు చేస్తామని కూడా వెల్లడించింది. దాడులు మరింతగా ఉధృతం అవుతాయని కూడా సుప్రీంకమాండర్ మొజ్తబా ఖమైనీ పేరిట హెచ్చరికలు వెలువడ్డాయి. అంతేకాకుండా ఇరాన్ ఇపుడు తన వ్యూహాన్ని కూడా మారుస్తోంది. సముద్రగర్భంలోని ఇంటర్నెట్ కేబుళ్లపై దృష్టిసారించింది. అదే జరిగితే పశ్చిమాసియాతోపాటుయూరోప్‌లోని సగం దేశాలకు ఇంటర్నెట్ బంద్ అవుతుందన్న ఆందోళన పెరుగుతోంది. ఇదిలా ఉంటే ఇరాన్‌కోసమే ప్రత్యేకంగా తరలించిన యుద్ధనౌక గెరాల్డ్ ఫోర్డ్ యుద్ధంనుంచి వైదొలగింది. గ్రీస్‌లోని నాటోస్థావరం క్రెటెకు మరమ్మతులకోసం బయలుదేరింది. నౌక తీవ్రస్థాయి అగ్ని ప్రమాదానికి లోనుకావడంవల్లనే యుద్ధం నుంచి వైదొలిగిందని అమెరికా చెప్పుకుంటున్నది. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో అమెరికా లోని ప్రముఖ నేతల ఇళ్లపై డ్రోన్ల కదలికలు కనిపించడంతో యుఎస్ నిఘా వ్యవస్థ అప్రమత్తం అయింది. ఈ డ్రోన్లు ఎలా వచ్చా యి. ఎక్కడినుంచి వచ్చాయన్న అంశంపై ఆదుర్దాపెరిగింది. రక్షణ మంత్రి పీట్ హెగ్సె త్, విదేశాంగమంత్రి మార్కోరుబియోల ఇళ్లపై నే ఈ డ్రోన్లకదలికలు పదేపదే కనిపించడంతో అమెరికా రక్షణ యంత్రాంగం అప్రమత్తం అయింది. అయితే యుద్ధక్షేత్రంలో నిర్వహణ కడు భారం అవుతోందని, 18 లక్షలకోట్లు ఇవ్వాలని అమెరికా రక్షణ వ్యవస్థ పెంటగాన్ ట్రంప్ సర్కారుకు నివేదిక ఇచ్చింది. ఖరీదైన ఆయుధ సామగ్రి వినియోగంతోరోజురోజుకూ వ్యయభారం పెరుగుతోందని పెంటగాన్ చెపుతోంది. ఇదిలా ఉంటే ఖతార్ జీవనాడి అయిన గ్యాస్ క్షేత్రం రాస్‌ల ఫాన్‌పై ఇరాన్ దాడిచేయడంపట్ల అమెరికా అధ్యక్షుడుట్రంప్ సీరియస్ అయ్యారు. ఇరాన్ సౌత్‌పార్స్ గ్యాస్ కేంద్రంపై ఇజ్రాయెల్‌మాత్రమే దాడిచేసిందని, అమెరికాకుగానీ, ఖతార్‌కుగానీ ఎలాంటి సంబంధం లేదన్నారు. ఇరాన్ గ్యాస్‌దాడిపై అమెరికాకు ఎలాంటి సమాచారంలేదని, ఖతార్‌కు అసలు సంబంధమే లేదని ట్రూత్‌సోషల్‌మీడియాలో వెల్లడించారు. మరోసారి ఖతార్‌ను లక్ష్యంగాచేసుకుని దాడిచేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ట్రంప్ వార్నింగ్ ఇచ్చారు. ఇరాన్ హద్దులుమీరితే ఇజ్రాయెల్ ప్రమేయం లేకుండానే సౌత్‌పార్స్ మైదానంపై అత్యంత శక్తివంతమైన బలప్రయోగంచేస్తుందని ఆయన అన్నారు. ఇదిలా ఉంటే సౌదీలోని అతిపెద్ద ఆయిల్ రిఫైనరీ ఆరామ్‌కోపై ఇరాన్‌మరోసారి క్షిపణి దాడులుచేయడంతో సౌదీ ఆగ్రహావేశాలు వ్యక్తంచేసింది. అలాగే ఖతార్ అతిపెద్ద సహజవాయుకేంద్రం రాస్ లఫాన్‌పై ఇరాన్‌దాడిచేయడాన్ని కూడా గల్ఫ్ కూటమి తీవ్రంగాపరిగణిస్తోంది దీనితో ఇపుడు అమెరికామద్దతు ఉన్నా లేకున్నా ఇరాన్‌పై సైనిక చర్యకు దిగాల్సి ఉంటుందని సౌదీ అరేబియా హెచ్చరించింది. సౌదీతోపాటు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సైతం ఇదే దోరణిలో హెచ్చరికలుచేయడం ఇరాన్‌పై ముప్పేట దాడి వెనుక అమెరికా వ్యూహం ఉందనే స్పష్టం అవుతోంది. ఇరాన్‌పై యుద్ధంలో తాము అనుకున్న లక్ష్యాలన్నీ సాధించామని, యుద్ధం మేమేముగిస్తామని అమెరికా రక్షణమంత్రి పీట్‌హెగ్స్ త్ అన్నారు. ఖతార్, సౌదీలపై దాడికి ఇరాన్ భారీ మూల్యం చెల్లించుకుంటుందని, ఇప్పటికే ఇరాన్‌లోని ఆయుధ వ్యవస్థలు, నౌకాదళ వ్యవస్థలన్నింటినీ నాశనంచేసామని, 11 జలాంతర్గాములను ధ్వంసంచేసామని ఆయన అన్నారు. ఏ లక్ష్యంతో యుద్ధం ప్రారంభించామో అన్నీ సాధించి అనుకున్న మిషన్ పూర్తిచేస్తామని అమెరికా రక్షణ మంత్రి స్పష్టంచేయడాన్ని చూస్తే యుద్ధం మరికొంతకాలం అనివార్యం అని తెలుస్తోంది.



## యుద్ధం కోసం రూ. 18 లక్షల కోట్లివ్వండి! : పెంటగాన్

**వాషింగ్టన్, మార్చి 19:** ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై భీకర యుద్ధం చేస్తోన్న అమెరికా.. ఇందుకోసం భారీగా ఖర్చుపెడుతోంది. ఇప్పటికే రూ. వేలాది కోట్ల విలువైన ఆయుధాలను వినియోగించగా.. రానున్న రోజుల్లో దీనిని కొనసాగించేందుకు భారీ ప్రణాళికలు సిద్ధం చేసుకుంటోంది. ఈ క్రమంలో 200 బిలియన్ డాలర్లకుపైగా నిధులు కోరినట్లు అమెరికా పార్లమెంట్‌కు చేసిన ప్రతిపాదనను ఆమోదించాలని పెంటగాన్ కోరినట్లు తెలిసింది. ఈ మేరకు వాషింగ్టన్ పోస్టు కథనాన్ని ప్రచురించింది. దీనిపై ఇరాన్ స్పందిస్తూ.. ఇజ్రాయెల్ అజెండాను అమలు చేసేందుకు సొంత పౌరులపైనే అమెరికా భారం మోపుతోందని విమర్శలు గుప్పించింది. 'ఇరాన్, అమెరికాలపై రుద్దిన ఈ యుద్ధం మొదలై మూడు వారాలు మాత్రమే అయ్యింది. 200 బిలియన్ డాలర్లు అనేది చిన్న మొత్తమే. ఇజ్రాయెల్ అజెండా కోసం రూ. లక్షలాది కోట్లు ఖర్చు పెడుతున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే ఈ చర్యల పట్ల ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు అమెరికన్ ప్రజలు కృతజ్ఞత చెప్పాలి' అని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్జీ వ్యంగ్యంగా స్పందించారు. ఈ యుద్ధంలో పాల్గొనడం అమెరికాకు ఇష్టం లేదని అరాగ్చీ ఇటీవల పేర్కొన్న విషయం తెలిసిందే. అమెరికాను నెతన్యాహు ఇందులోకి లాగారని అన్నారు. అమెరికాలోని కొందరు అధికారుల కారణంగా అక్కడి పౌరులు ఈ యుద్ధ భారాన్ని మోస్తున్నారని అన్నారు. మరోవైపు, ఇరాన్ గ్యాస్ క్షేత్రాలపై దాడి గురించి ఇజ్రాయెల్ తమకు చెప్పలేదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు.

## రంగంలోకి నరేంద్ర మోడి

### ప్రపంచ దేశాధినేతలతో ప్రధాని ఫోన్‌ఛాట్!



**న్యూఢిల్లీ, మార్చి 19:** పశ్చిమాసియా యుద్ధం తీవ్రరూపం దాల్చుతున్న వేళ భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రపంచ నేతలతో మాట్లాడారు. సౌదీ అరేబియాలోని గ్యాస్ కేంద్రాలపై దాడులతో ప్రపంచ దేశాలకు గ్యాస్ కొరత ఏర్పడనున్న నేపథ్యంలో అందరూ అప్రమత్తం కావాలని మోడీ కోరారు. పశ్చిమాసియాలో తక్షణమే శాంతి స్థాపనకు చొరవ చూపాలని ఆయన గురువారం ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మన్యుయేల్ మక్రాన్, మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం, ఒమన్ సుల్తాన్‌లకు విజ్ఞప్తి చేశారు. ఇజ్రాయేల్, అమెరికా దాడులకు ప్రతిచర్యగా సౌదీ అరేబియాలోని గ్యాస్ రిఫైనరీ కేంద్రాలపై ఇరాన్ విరుచుకుపడుతోంది. ఫలితంగా ముడి చమురు ధర.. లిక్విడ్ పెట్రోలియం గ్యాస్ ధరలు ఆకాశాన్నంటేలా ఉన్నాయి. యుద్ధం ఇలానే కొనసాగితే గ్యాస్ సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సిన ముప్పు తప్పేలా లేదు. దాంతో తక్షణమే పశ్చిమాసియాలో శాంతి, సుస్థిరత స్థాపనకు కృషి చేయాలని భారత ప్రధాని ప్రపంచ నేతలను కోరారు. ఇదే అంశంపై గురువారం ఆయన ఫ్రాన్స్ అధ్యక్షుడు, మలేషియా ప్రధాని, ఒమన్ సుల్తాన్‌తో ప్రత్యేకంగా మాట్లాడారు. నా ప్రియమైన స్నేహితుడు ఎమ్మాన్యుయేల్ మక్రాన్‌తో పశ్చిమాసియా యుద్ధం గురించి మాట్లాడాను. తక్షణమే యుద్ధ తీవ్రతను తగ్గించాల్సిన అవసరముందని, చర్చల ద్వారా సమస్యకు పరిష్కారం చూపాలనే విషయంపై ఆయనతో చెప్పాను. ఆ ప్రాంతంలో శాంతి స్థాపనకు, సుస్థిరత నెలకొనేందుకు అవసరమైన సాయం చేయడానికి మేము సిద్ధంగా ఉన్నామని వివరించానని మోడీ తన సోషల్‌మీడి ఆ పోస్ట్‌లో వెల్లడించారు. నా స్నేహితుడు, మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో మాట్లాడాను. హరి రయా ఐదిల్‌ఫిత్రి పండుగను పురస్కరించుకొని ఆయనకు, మలేషియా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశాను. ప్రపంచాన్ని కలవరపరుస్తున్న పశ్చిమాసియాలో యుద్ధం గురించి ద్దరం చర్చించాం. చర్చల ద్వారా, రాయబారం ద్వారా ఆ ప్రాంతంలో ఉద్రిక్తతలను తగ్గించడానికి, వీలైనంత తొందరగా శాంతి స్థాపనకు, సుస్థిరత నెలకొల్పడానికి కృషి చేయాల్సిన అవసరముందని ఇరువురం భావించాం అని మోడీ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. నా సోదరుడు సుల్తాన్ హైథమ్ బిన్ తారీఖ్‌తో సంభాషణ అర్ధవంతంగా సాగింది. ఒమన్ ప్రజలకు ఈద్ శుభాకాంక్షలు తెలియజేశాను. పశ్చిమాసియాలో శాంతి స్థాపన అత్యవసరమని, అక్కడ సుస్థిరత ఏర్పాటు గురించీ మాట్లాడుకున్నాం. ఒమన్ సార్వభౌమత్వాన్ని దెబ్బతీసేలా దాడులు చేయడాన్ని భారత్ ఖండిస్తుందనే విషయాన్ని మరోమారు తెలియజేశాను. భారతీయులతో పాటు వేలాది మందిని సురక్షితంగా తరలించినందుకు ఒమన్ ప్రభుత్వం కృషిని అభినందించాను. హార్మూజ్ జలసంధి గుండా సురక్షితంగా, స్వేచ్ఛగా రాకపోకలు జరగాలనే మాటకు భారత్, ఒమన్ కట్టుబడి ఉన్నాయి అని మోడీ వెల్లడించారు.



## ప్రముఖుల నివాసాలపై డ్రోన్‌ల కదలికలు

### ఆందోళనలో అమెరికా నిఘా వేగులు

**వాషింగ్టన్, మార్చి 19:** అమెరికా ప్రభుత్వంలో ప్రధాన బాధ్యతలు నిర్వహిస్తున్న నేతల నివాసాలపై డ్రోన్లు సంచరించడం తీవ్ర కలకలం రేపుతోంది. విదేశాంగ మంత్రి మార్కో రూబియో, రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్‌ల నివాసాల పరిసరాల్లో ఈ డ్రోన్లు కనిపించడంతో నిఘా వర్గాలు ఉలిక్కిపడ్డాయి. కొన్ని రోజులుగా వర్జీనియాలోని లాంగ్లీ ఎయిర్ ఫోర్స్ బేస్ వంటి అత్యంత కీలకమైన సైనిక స్థావరాల వద్ద కూడా రాత్రి సమయాల్లో ఈ డ్రోన్లు చక్కర్లు కొడుతున్నాయి. సుమారు 20 డ్రోన్లు గుంపులుగా ఏర్పడి, తక్కువ ఎత్తులో ఎగురుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ డ్రోన్లను ఎవరు, ఎక్కడి నుంచి ఆపరేట్ చేస్తున్నారనేది అధికారులకు అంతుచిక్కడం లేదు. ఇవి సాధారణ వాణిజ్య డ్రోన్ల కంటే చాలా వేగంగా ప్రయాణిస్తుండటంతో, వాటిని అడ్డుకోవడం సవాలుగా మారింది. ఈ ఘటనలపై ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్ బీఐ), పెంటగాన్ ఉన్నత స్థాయి దర్యాప్తు ప్రారంభించాయి. కీలక నేతల కదలికలపై నిఘా పెట్టేందుకు ఇరాన్ లేదా ఇతర విదేశీ శక్తులు ఈ డ్రోన్లను ప్రయోగిస్తున్నాయా అనే కోణంలో అధికారులు విచారిస్తున్నారు.

## రిపబ్లిక్‌డే వేడుకలు జెండా వందనాలకే పరిమితం చేసిన పాకిస్తాన్



**ఇస్లామాబాద్, మార్చి 19:** ఆర్థిక సంక్షోభం కోరల్లో చిక్కుకున్న పాకిస్థాన్, తన రిపబ్లిక్ డే (మార్చి 23) వేడుకలు కేవలం జెండా ఆవిష్కరణలకే పరిమితమని పాక్ షరీఫ్ సర్కారు ప్రకటించింది. దేశంలో నెలకొన్న విపత్కర పరిస్థితుల దృష్ట్యా ఈ ఏడాది అధికారిక వేడుకలను రద్దు చేస్తున్నట్లు ప్రధాని షెహబాజ్ షరీఫ్ కార్యాలయం ప్రకటించింది. ఆడంబరాలకు పోకుండా కేవలం జెండా ఆవిష్కరణకే ఈ వేడుకలను పరిమితం చేయాలని నిర్ణయించారు. గల్ఫ్ ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, ప్రపంచవ్యాప్తంగా ఆకాశాన్నంటుతున్న చమురు ధరల నేపథ్యంలో పాక్ ప్రభుత్వం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. సాధారణంగా అట్టహాసంగా జరిగే సైనిక కవాతు, 31గన్ సెల్యూట్, భారీ సాంస్కృతిక ప్రదర్శనలను ఈసారి పూర్తిగా నిలిపివేశారు. ప్రభుత్వ శాఖలన్నీ నిరాడంబరంగా వ్యవహరించాలని, అనవసర ఖర్చులకు తావు లేకుండా గౌరవప్రదంగా ఈ సందర్భాన్ని పాటించాలని ప్రధాని ఆదేశించారు.

## మెగాస్టార్ చిరుకు ఎన్టీఆర్ అవార్డు

- హైదరాబాద్ ఎంతో సురక్షితమైన ప్రాంతం
- ప్రపంచ సినీ పరిశ్రమకు హైదరాబాద్ కేంద్రం
- గద్దర్ అవార్డుల కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 19 ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి:** సినీ పరిశ్రమను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని తమ ప్రభుత్వం నిర్ణయించుకుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ సినీ పరిశ్రమ హైదరాబాద్‌లో ప్రవేశించేందుకు సింగిల్ విండో ద్వారా అనుమతి ఇవ్వాలని నిర్ణయించామని పేర్కొన్నారు. ఐటీ, ఫార్మా ఇండస్ట్రీతో సమానంగా సినిమా ఇండస్ట్రీని కూడా ప్రోత్సహిస్తున్నామని, టాలీవుడ్ ఎంతో ఎదగాలని, పాటు బాలీవుడ్,హాలీవుడ్ కూడా హైదరాబాద్‌కు తరలి రావాలని కోరుతున్నట్లు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ హాల్‌లో గద్దర్ అవార్డుల ప్రధానోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై సినీ ప్రముఖులకు అవార్డులన అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ ఎంతో సురక్షితమైన ప్రాంతమని, గద్దర్ స్ఫూర్తితోనే సామాజిక రుగ్మతలను పోగొట్టేందుకు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చైతన్యవంతమైన సినిమాలు తీయాలని కోరారు. ఇప్పుడు దుబాయిలో బాంబులు పడుతున్నాయని, కానీ ఇదే సమయంలో హైదరాబాద్‌లో సినిమా అవార్డుల కార్యక్రమం జరుపుకుంటున్నామన్నారు. సరిహద్దులో పాకిస్తాన్ దాడులను తిప్పికొడుతూ ఆపరేషన్ సింధూర్ మన జవాన్లు నిర్వహిస్తున్న సమయంలో హైదరాబాద్‌లో ప్రపంచ సుందరి పోటీలను నిర్వహించుకున్నామన్నారు. తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డులను ఇవ్వడం మా ప్రభుత్వం బాధ్యతగా భావించిందన్నారు. హైదరాబాద్ అంటే కేవలం ఐటీ హబ్, బిర్యానీ మాత్రమే కాదు.. ఇదొక సినిమా హబ్ కు కేరాఫ్ హైదరాబాద్ కు చార్ మినార్ లోని చార్ మినార్స్ లాగా ఎన్టీఆర్, ఏఎన్నార్, రామానాయుడు, కృష్ణ నలుగురు సినీ పరిశ్రమను ఉన్నత స్థాయికి తీసుకెళ్లారని చెప్పారు. రామోజీ రావు ఫిల్మ్ సిటీ ఏర్పాటు చేసి హైదరాబాద్‌ను సినీ పరిశ్రమ అభివృద్ధికి కృషి చేశారని పేర్కొన్నారు. ప్రభాకర్ రెడ్డి సినీ కార్మికుల కోసం తన సొంత స్థలాన్ని ఇచ్చి ఆదుకున్నారని, ఆనాడు సినీ రంగంలో





ఏ సమస్య వచ్చినా ముందుండే దాసరి నారాయణ రావును స్మరించుకోవాల్సినా అవసరం ఉందన్నారు. హైదరాబాద్ ను గ్లోబల్ సినీ హబ్ గా తీర్చి దిద్దేందుకు మా ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఇటీవల నెట్ ఫ్లిక్స్ తమ సంస్థను హైదరాబాద్ లో ఏర్పాటు చేసింది నెట్ ఫ్లిక్స్ వచ్చిందంటే హైదరాబాద్‌కు హాలీవుడ్ వచ్చినట్టేనని చెప్పారు. గద్దర్ ఒక చైతన్యం.. ఒక స్ఫూర్తి తన పాటతో వేలాది మందిలో చైతన్యం తీసుకువచ్చిన ఆయన పేరుతో ఈ అవార్డులు ఇవ్వడం సంతోషకరన్నారు. సినిమా అనేది మోస్ట్ పవర్ ఫుల్ వెపన్ సినిమా సమాజాన్ని చైతన్యపరిచేందుకు సినిమాను సాధనంగా ఉపయోగించుకోవాలని చెప్పారు. సామాజిక బాధ్యతను గుర్తెరిగి గద్దర్ స్ఫూర్తితో సామాజిక సమస్యలను పరిష్కారానికి సినిమా ద్వారా సందేశం అందించాలని చెప్పారు.





తెలంగాణ ఆత్మను ప్రపంచానికి పరిచయం చేసిన మహనీయుడు గద్దర్. ఆయన పేరిట అవార్డులు ఇవ్వడం అంటే ప్రభుత్వ ఆలోచన ఏమిటో ప్రపంచానికి చెప్పడమేనని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన డిప్యూటీ సిఎం మాట్లాడు తూ తెలుగు చిత్ర పరిశ్రమ హాలీవుడ్ స్థాయి కి ఎదిగింది అనేక సందేశాత్మక సినిమాలు వస్తున్నాయని, ప్రజల్లో మార్పునకు నాంది పలికాయని చెప్పారు. తెలుగు సినిమా తెలంగాణ రాష్ట్రానికే పరిమితం కాకుండా ప్రపంచానికే తలమానికం కావాలని సీఎం రేవంత్ రెడ్డి గద్దర్ పేరిట సినిమా అవార్డుల ను తిరిగి ప్రారంభించారని తెలిపారు. గత పాలకులు 10సంవత్సరాల పాటు సినిమా అవార్డులు ఇవ్వలేదని మండిపడ్డారు. గద్దర్ ఫిలిం అవార్డుల ఫంక్షన్ కోసం ఎంతో బిజీగా ఉండే ప్రముఖ నటులు హైద్రాబాద్ కు వచ్చినందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ధన్యవాదాలు తెలిపారు. సామాజిక సందేశాత్మక సినిమాలను పారదర్శకంగా ఎంపిక చేసిన ఫిలిం డెవలప్మెంట్ కౌన్సిల్, జ్యూరీ సభ్యులకు అభినందనలు తెలిపారు.

## మంటల్లో పశ్చిమాసియా

### హార్ముజ్‌లో చిక్కుకున్న భారత్ 3.2 లక్షల టన్నుల గ్యాస్

**దేశీయ నిల్వల నివేదికలివ్వాలని ఆయిల్ కంపెనీలకు కేంద్రం ఆదేశం**

**న్యూఢిల్లీ, మార్చి 19:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు భారత్ గ్యాస్ నిల్వలపై మరింత ప్రభావం చూపించేప్రమాదం పొంచి ఉంది. ఇరాన్ ఇజ్రాయెల్ మధ్య యుద్ధం కారణంగా హార్ముజ్ జలసంధిలో నౌకల రవాణాకు ఆటంకాలు ఏర్పడి భారత్‌కు రావాల్సిన సుమారు 3.2 లక్షల టన్నుల వంట గ్యాస్ (ఎల్పీజీ) సరుకు సముద్ర మార్గంలోనే నిలిచిపోయింది. కేంద్ర షిప్పింగ్ మంత్రిత్వ శాఖ వెల్లడించిన సమాచారం ప్రకారం, ప్రస్తుతం హార్మూజ్ జలసంధి సమీపంలో 22 నౌకలు చిక్కుకుపోయాయి. వీటిలో భారత్ కు ఎల్పీజీని తీసుకొస్తున్న భారీ నౌకలు కూడా ఉన్నాయి. యుద్ధ వాతావరణం నేపథ్యంలో భద్రతాపరమైన అనుమతులు లభించకపోవడంతో ఈ నౌకలు ముందుకు కదలలేని పరిస్థితుల్లో ఉన్నాయి. ఇరాన్, ఇజ్రాయెల్‌అమెరికా కూటమి మధ్య ఘర్షణలు 20వ రోజుకు చేరుకున్నా ఉద్రిక్తతలు తగ్గలేదు. యుద్ధం మరికొంత కాలం కొనసాగవచ్చన్న సంకేతాలతో అంతర్జాతీయ సరఫరా మార్గాలపై ఆందోళనలు పెరుగుతున్నాయి. భారత్ తన ఎల్పీజీ అవసరాల్లో సింహభాగం గల్ఫ్ దేశాల నుంచే దిగుమతి చేసుకుంటోంది. హార్మూజ్ మార్గంలో అంతరాయం ఇలాగే కొనసాగితే దేశీయంగా గ్యాస్ సరఫరా గొలుసు దెబ్బతినే ప్రమాదం ఉంది.

### ఇజ్రాయెల్ చేసింది తప్పే: ట్రంప్

**వాషింగ్టన్, మార్చి 19:** ఇరాన్‌లోని కీలకమైన సౌత్ ఫార్స్ చమురు క్షేత్రంపై ఇజ్రాయెల్ దాడులకు దిగింది. ఈ దాడులకు ప్రతీకారంగా అంతకంటే విలువైన ఖతార్‌లోని రాస్ లఫాన్ ఆయిల్ హబ్‌పై ఇరాన్ క్షిపణులతో దాడి చేసింది. దీంతో అంతర్జాతీయంగా తీవ్ర నిరసన వ్యక్తమవు తోంది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ, ఇజ్రాయెల్ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. "ఇజ్రాయెల్ చేసింది తప్పే. ఇది తమకు తెలియకుండా జరిగిన దాడి" అని ట్రూత్ సోషల్‌లో చేసిన పోస్టులో ట్రంప్ అంగీకరించారు. ఖతార్‌పై ఇరాన్ చేసిన దాడి కూడా తప్పేనని ట్రంప్ అన్నారు. మరోసారి ఖతార్ చమురు హబ్‌పై ఇరాన్ దాడి చేస్తే తామే ఆ దేశంలోని సౌత్ ఫార్స్ చమురు క్షేత్రంపై భారీ దాడి చేసి నాశనం చేస్తామంటూ ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు. మధ్యప్రాచ్యంలో జరిగిన పరిణామాలపై ఆగ్రహంతో ఇజ్రాయెల్, ఇరాన్‌లోని సౌత్ పార్స్ గ్యాస్ ఫీల్డ్ అనే ఒక ప్రధాన కేంద్రంపై హింసాత్మకంగా దాడి చేసిందని, మొత్తం కేంద్రంలో ఒక్క చిన్న భాగం దెబ్బతిందని ట్రంప్ తెలిపారు. ఈ ప్రత్యేక దాడి గురించి అమెరికాకు ఏమీ తెలియదు. .

### సౌదీ ఆరామ్‌కోపై ఇరాన్ మళ్లీ దాడి!

**దుబాయి, మార్చి 19:** సౌదీ అరేబియాలోని కీలక చమురు శుద్ధి కర్మాగారం లక్ష్యంగా ఇరాన్ దాడికి పాల్పడింది. గురువారం తెల్లవారుజామున సౌదీలోని అరామ్‌కో చమురు శుద్ధి కర్మాగారంపై డ్రోన్ దాడి జరిగినట్లు ఆ దేశ రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. నష్టాన్ని అంచనా వేస్తున్నట్లు వెల్లడించింది. ఎర్ర సముద్రంలోని యాన్బు పోర్టు సమీపంలో ఈ రిఫైనరీ ఉంది. డ్రోన్ దాడి కారణంగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగి, రిఫైనరీ స్వల్పంగా దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. ఎవరైనా గాయపడ్డారా అనేది తెలియాల్సి ఉంది. ఇరాన్ అంతకుముందు ఖతార్ ఇంధన మౌలిక సదుపాయాలపై దాడి చేసింది. ఖతార్‌లోని అత్యంత కీలకమైన రస్ లాఫాన్ ఇండస్ట్రియల్ సిటీపై దాడికి పాల్పడింది.

### పశ్చిమాసియాకు వేలాదిగా అమెరికా బలగాలు!

**వాషింగ్టన్, మార్చి 19:** అమెరికా–ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం ఇప్పుడే సద్దుమణిగే అవకాశాలు కన్పించడం లేదు. ఇరాన్‌తో జరుగుతోన్న పోరును తదుపరి దశకు తీసుకెళ్లేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగా వేలాది యుఎస్ బలగాలను పశ్చిమాసియాకు తరలించాలని యోచిస్తున్నట్లు సమాచారం అమెరికా అధికారులు ఈ విషయం తెలిపినట్లు రాయిటర్స్ తన కథనంలో పేర్కొంది. దాని ప్రకారం.. 'పశ్చిమాసియాలో తమ కార్యకలాపాలను బలోపేతం చేసేందుకు వేలాది మంది సైనికులను అక్కడ మోహరించాలని ప్రభుత్వం యోచిస్తోంది' అని ఆ అమెరికా అధికారి పేర్కొన్నారు. వైమానిక, నావికాదళాల ద్వారా హార్మూజ్ జలసంధి మీదుగా చమురు ట్యాంకర్ల రవాణాకు రక్షణ కల్పించే విషయంపైనా ప్రభుత్వం చర్చలు జరిపినట్లు వెల్లడించారు. అయితే, ఇందుకోసం ఇరాన్ తీర ప్రాంతంలో యుఎస్ సైన్యాన్ని మోహరించాల్సి రావచ్చన్నారు.

### భవిష్యత్తు యుద్ధాలన్నీ సైబర్ వార్‌లే!

**ఎఐ, సైబర్ దాడులు, డ్రోన్లదే భూమిక**

**వాషింగ్టన్, మార్చి 19:** యుద్ధాల స్వరూపం భవిష్యత్తులో పూర్తిగా మారిపోతోంది. భారీ సైన్యాల స్థానంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ ఆపరేషన్లు, డ్రోన్లు వంటి స్వయంప్రతిపత్తి కలిగిన వ్యవస్థలు రానున్నాయి. అమెరికా కాంగ్రెస్ కమిటీ ప్రత్యేక ఆపరేషన్ బలగాలపై నిర్వహించిన విచారణలో ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. మారుతున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు తన సైన్యాన్ని పునర్వ్యవస్థీకరిస్తున్న భారత్, ఈ పరిణామాలను అత్యంత నిశితంగా గమనిస్తోంది. యుద్ధ క్షేత్రం వేగంగా రూపాంతరం చెందుతోందని, టెక్నాలజీ అందరికీ అందుబాటులోకి రావడంతో దేశాలతో పాటు, దేశాలతో సంబంధం లేని చిన్న గ్రూపులు కూడా డ్రోన్లు, సైబర్ టూల్స్, ఏఐ ఆధారిత వ్యవస్థలను సులభంగా వినియోగించగలుగుతున్నాయని అమెరికా చట్టసభ సభ్యులు, సైనిక ఉన్నతాధికారులు అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ సభ్యుడు జాసన్ క్రో మాట్లాడుతూ ఏఐ, డ్రోన్లు, సంక్లిష్టమైన సైబర్ టూల్స్ వంటి అధునాతన సాంకేతికతను పొందేందుకు అడ్డంకులు మునుపెన్నడూ లేనంతగా తగ్గాయి. దీనివల్ల చిన్న సమూహాలు కూడా తమ శక్తికి మించి దెబ్బతీయగలవని హెచ్చరించారు.

### తొలిసారిగా ఉత్తర కొరియాలో వ్యతిరేక ఓట్ల వివరాలు

**ప్యాంగ్యాంగ్, మార్చి 19:** ఉత్తర కొరియాలో జరిగిన పార్లమెంటు ఎన్నికల ఫలితాల్లో ఊహించినట్లే అధికార వర్కర్స్ పార్టీ ఆఫ్ కొరియా ఘన విజయం సాధించింది. ఈ నెల 15న జరిగిన ఈ ఎన్నికల్లో కిమ్ జోంగ్ ఉన్ నాయకత్వంలోని పార్టీ, దాని మిత్రపక్షాలు ఏకంగా 99.93 శాతం ఓట్లను కైవసం చేసుకున్నాయి. ఈసారి ఫలితాల్లో ఒక అనూహ్యమైన, ఆసక్తికరమైన పరిణామం చోటుచేసుకుంది. దశాబ్దాల చరిత్రలో తొలిసారిగా అధికార అభ్యర్థులకు వ్యతిరేకంగా ఓట్లు పోలైన విషయాన్ని ఆ దేశ ప్రభుత్వమే అధికారికంగా ప్రకటించింది. ఉత్తర కొరియా 15వ సుప్రీం పీపుల్స్ అసెంబ్లీ కోసం జరిగిన ఈ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా అన్ని స్థానాలనూ అధికార కూటమి అభ్యర్థులే గెలుచుకున్నారు. దేశంలో నమోదైన ఓటర్లలో ఏకంగా 99.99 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని, ఇది ఒక రికార్డు అని ప్రభుత్వ మీడియా సంస్థ కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ ప్రకటించింది. విదేశాల్లో లేదా సముద్రంలో విధుల్లో ఉన్న కొద్దిమంది మాత్రమే ఓటు వేయలేదని తెలిపింది. ఫలితాల ప్రకారం అధికార పార్టీకి అనుకూలంగా 99.93 శాతం ఓట్లు పోలయ్యాయి. మిగిలిన 0.07 శాతం ఓట్లు అధికార అభ్యర్థులను తిరస్కరిస్తూ పోలైన వ్యతిరేక ఓట్లు అని ప్రభుత్వం అంగీకరించింది.

### గ్లోబల్ ఇంటర్నెట్‌కు ఇరాన్ వార్ ముప్పు

**వాషింగ్టన్, మార్చి 19:** పశ్చిమాసియాలో ఇజ్రాయెల్‌అమెరికా, ఇరాన్ మధ్య ముదురుతున్న యుద్ధం ప్రపంచ ఇంటర్నెట్ వ్యవస్థకు కొత్త ముప్పును తెచ్చింది. హార్మూజ్ జలసంధిలో సముద్ర గర్భంలో ఉన్న ఇంటర్నెట్ ఫైబర్ ఆప్టిక్ కేబుళ్లను ఇరాన్ లక్ష్యంగా చేసుకోవచ్చన్న ఆందోళనలు ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్నాయి. ఇదే నిజమైతే గ్లోబల్ ఇంటర్నెట్ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడి, ప్రపంచ దేశాలపై దాని ప్రభావం భారీగా ఉంటుంది. యుద్ధం కారణంగా హార్మూజ్ జలసంధితో పాటు ఎర్ర సముద్రం కూడా వాణిజ్య నౌకల రాకపోకలకు మూసుకుపోయింది. మార్చి 3న ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ), హార్మూజ్‌ను దాటే ప్రయత్నం చేసే ఏ నౌకనైనా కాల్చివేస్తామని హెచ్చరించింది. ఇరాన్‌కు మద్దతుగా హౌతీ మిలిటెంట్లు ఎర్ర సముద్రంలో దాడులను పునః ప్రారంభించడంతో రెండు ప్రధాన సముద్ర మార్గాలు యుద్ధ క్షేత్రాలుగా మారాయి.

## ఏప్రిల్ 1 నుంచి జూనియర్ కళాశాలల పునఃప్రారంభం

**విజయవాడ మార్చి 19 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో జూనియర్ కళాశాలలు ఏప్రిల్ ఒకటో తేదీన పునఃప్రారంభం కానున్నాయి. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు రాసి రెండో ఏడాదిలోకి వచ్చిన విద్యార్థులకు ఏప్రిల్ ఒకటి నుంచి 23 వరకు తరగతులు నిర్వహిస్తారు. 24 నుంచి మే 31 వరకు వేసవి సెలవులు ఇస్తారు. 2025-26 విద్యాసంవత్సరం నుంచి ఇంటర్మీడియట్‌లో ఎన్‌సీఈఆర్టీ సిలబస్‌ను ప్రవేశపెట్టి, సీబీఎస్ఈ విధానాన్ని పాటిస్తున్నారు. దీంతో పబ్లిక్ పరీక్షల తర్వాత ఏప్రిల్‌లో తరగతులు నిర్వహించి , ఆ తర్వాత వేసవి సెలవులు ఇచ్చేలా విద్యా ప్రణాళిక రూపొందించారు. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి అకడమిక్ కేలండర్‌ను బుధవారం ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యదర్శి రంజిత్ బాషా విడుదల చేశారు. విద్యా సంవత్సరంలో మొత్తం 232 రోజులు కళాశాలలు పని చేయనున్నాయి. విద్యార్థుల ప్రవేశాల కోసం పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత, ర్యాంకుల గ్యారెంటీపై ప్రైవేటు జూనియర్ కళాశాలలు ప్రచారం చేయడం చట్ట విరుద్ధమని, కళాశాలల మధ్య అనారోగ్యకరమైన పోటీని సృష్టించే హోర్డింగ్‌లు, కరపత్రాలు పంపిణీ, గోడలపై రాతలు, ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాలో ప్రకటనలు ఇవ్వరాదని కార్యదర్శి రంజిత్ బాషా ఆదేశించారు. వేసవి సెలవుల అనంతరం జూన్ 1న జూనియర్ కళాశాలలు పునఃప్రారంభమవుతాయి. అక్టోబరు 5 నుంచి 9వరకు త్రైమాసిక పరీక్షలు. దసరా సెలవులు అక్టోబరు 10-20. అర్థ సంవత్సరం పరీక్షలు నవంబరు 25-30, సంక్రాంతి సెలవులు జనవరి 9-17 ప్రీఫైనల్ పరీక్షలు జనవరి 19-23. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు-ఫిబ్రవరి. థియరీ పబ్లిక్ పరీక్షలు - ఫిబ్రవరి/మార్చి. 2026-27 చివరి వర్కింగ్ డే మార్చి 18 ఉంటుంది.

## పంచాయతీల్లో ఓటర్ల జాబితాలు ప్రచురించాల్సిందే:
### రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలంసాహ్ని

**విజయవాడ మార్చి 19 ప్రభాతవార్త ప్రతినిధి:** పంచాయతీల్లో ఓటర్ల జాబితాల ప్రచురణకు నాలుగు వారాల గడువు పెంచాలన్న రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలంసాహ్ని తోసిపుచ్చారు. గడువు పెంచేందుకు సరైన కారణం లేనందున, పంచాయతీల్లో వార్డుల వారీగా ఓటర్ల జాబితాలు ప్రచురించాల్సిందేనని ఆమె పునరుద్ఘాటించారు. ఆలస్యమైన పంచాయతీల విషయంలో పునఃసమీక్షించి తదుపరి నిర్ణయాన్ని వెల్లడిస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి రాసిన లేఖకు ఎస్ఈసీ బుధవారం సమాధానమిచ్చారు. ఎలక్టోరల్ మేనేజ్‌మెంట్ సిస్టంలో కొత్త సాఫ్ట్‌వేర్ మాడ్యూల్ ఆధారంగా పంచాయతీల వారీగా ఓటర్ల జాబితాలు ప్రచురించాలన్న ఎస్ఈసీద ఆదేశాలపై రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ ఇటీవల లేఖ రాశారు. కొత్త విధానంతో పంచాయతీల్లో వార్డుల వారీగా ఓటర్ల జాబితాల తయారీ, ప్రచురణకు సాంకేతికంగా పలు సమస్యలు తలెత్తుతున్నట్లు ఎస్ఈసీ దృష్టికి తీసుకెళ్లారు. వీటిని అధిగమించేందుకు నాలుగు వారాల గడువు పెంచాలని కోరారు. ఆయన లేఖపై ఎస్ఈసీ బదులిచ్చారు. గ్రామ పంచాయతీల్లో ఓటర్ల జాబితాల తయారీకి సంబంధించిన ప్రధాన పనులు ఇప్పటికే పూర్తయ్యాయి.

13,3551 పంచాయతీల్లో ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయింది. ఇలాంటి పరిస్థితుల్లో జాబితాల ప్రచురణకు గడువు పొడిగించేందుకు మీరు చెబుతున్న కారణం సహేతుకంగా లేదని కమిషన్ భావిస్తోంది.

అందువల్ల ఓటర్ల జాబితాల ప్రచురణకు ఈ ఏడాది మార్చి 7న ఇచ్చిన ఆదేశాల అమలులోనే ఉంటాయి. సాంకేతిక, ఇతర కారణాలతో కొన్ని పంచాయతీల్లో ఓటర్ల జాబితాల ప్రచురణ ఆలస్యమైతే అలాంటివి పరిశీలించి తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశాలిస్తాం అని ఎస్ఈసీ పేర్కొన్నారు.

## అకాల వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి : ఎన్‌టిఆర్ కలెక్టర్

### - కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూం ఏర్పాటు

**విజయవాడ, మార్చి 19, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లాలో కురుస్తున్న అకాల వర్షాలకు అధికారులతోపాటు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లాకలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా సూచించారు. మరో మూడురోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో గురువారం ఆయన వివిధశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అకాల వర్షాలకు ఏవిధమైన ఇబ్బందులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. విజయవాడ నగరపాలక సంస్థ, పంచాయతీ, మున్సిపాలిటీల్లోనూ డ్రైనేజిల్లో అడ్డకుంలు లేకుండా శుభ్రం చేసి నీరు నిల్వకుండా జగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యవసాయశాఖ అధికారులు రైతులకు తగు సూచనలు ఇవ్వాలన్నారు. పంటలకు నష్టం కలుగకుండా రైతులను అప్రమత్తం చేయటంతో పాటు, కళ్ళాల్లోని మిర్చి, ధాన్యం తడచిపోకుండా భద్రపరచుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెవెన్యూ, పోలీస్, విద్యుత్, ఆర్అండ్‌బీ, అగ్నిమాపకశాఖ తదితర ప్రభుత్వ శాఖల అధికారులు అత్యవసర పరిస్థితుల్లో సత్వరమే స్పందించేలా సిద్ధంగా ఉండాలన్నారు. వడగళ్ళవానలతో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే కలెక్టర్ కార్యాలయంలోని కంట్రోల్‌రూంకి సెల్ : 9154970454 కి సమాచారం అందించాలని సూచించారు.

## ప్రకృతిలో సామరస్యంగా జీవించడంపై ప్రజలకు అవగాహన అవసరం..



ఆంధ్ర లైఫ్ ఫర్ నేచర్ సమిట్ 2026లోఅటవీశాఖ సలహాదారు కొమెర అంకారావుకు సన్మానం

**విజయవాడ మార్చి 19 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రకృతిలో సామరస్యంగా జీవించడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, పర్యావరణ భద్రతతో కూడిన ఆర్థికాభివృద్ధి అవసరమని సీఎంఎస్ వాతావరణ్ డైరెక్టర్ వాసంతీరావు పేర్కొన్నారు. సీఎంఎస్ వాతావరణ్, ది హ్యాబిటేట్స్ ట్రస్టు ఆధ్వర్యంలో కేంద్ర పర్యావరణ, అటవీశాఖ ,వరల్డ్ ఫుడ్ ఇండియా సహకారంతో విజయవాడలో రెండు రోజులపాటు జరిగిన ఆంధ్ర లైఫ్ ఫర్ నేచర్ సమిట్ 2026ముగిసింది. ఈ సందర్భంగా రౌండ్‌టేబుల్ సదస్సులో సీఆర్ మీడియా అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్, అటవీశాఖ అధికారి సుందర్, అటవీశాఖ విశ్రాంత అధికారి నళినీ మోహన్ మాట్లాడారు. కార్యక్రమంలో ది హ్యాబిటేట్స్ ట్రస్టు ప్రతినిధి సంతోష్, అమరావతి వాకర్స్ అండ్ రన్నర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు కాట్రగడ్డ అజయ్, విశ్రాంత ప్రిన్సిపల్ రామారావు, సామాజికవేత్త మధుసూధన్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అటవీ, పర్యావరణ పరిరక్షణలో చేసిన సేవలకు గుర్తింపుగా అటవీశాఖ సలహాదారు కొమెర అంకారావుకు, గ్రామ దీప్ ట్రస్టు ప్రతినిధి డాక్టర్ సౌందర్య మనోహారికి గ్రీన్ అంబాసిడర్ అవార్డులు అందించారు. రాష్ట్రంలో ప్రకృతి - అభివృద్ధిని సమన్వయం చేయడానికి అతిపెద్ద అవకాశం ఎక్కుడుందని సదస్సు సందర్భంగా ఆన్‌లైన్‌లో చేపట్టిన సర్వేలో ఎక్కువ మంది అమరావతి అని సమాధానమిచ్చారని నిర్వాహకులు తెలిపారు.

## దుర్గామాతకు పట్టువస్త్రాలు సమర్పించిన సిపి దంపతులు


దుర్గామాత రధాన్ని లాగుతున్న సిపి రాజశేఖరబాబు ఇతర పోలీసు అధికారులు

**విజయవాడ, మార్చి 19, ప్రభాతవార్త :** విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన అమ్మలగన్న అమ్మ దుర్గమ్మకు విజయవాడ పోలీస్ కమీషనర్ ఎన్.వి.రాజశేఖరబాబు దంపతులు పట్టువస్త్రాలను సమర్పించారు. విజయవాడ కనకదుర్గగుడిలో గురువారం నుండి ఈనెల 27వతేదీ వరకు ఉగాది-వసంత నవరాత్రి మహోత్సవ వేడుకలు జరుగుతాయి. ఈనేపధ్యంలో అనవాయితీ ప్రకారం గురువారం సాయంత్రం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలోని రావిచెట్టు వద్ద సిపి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దుర్గామల్లేశ్వరస్వామి వార్లు వెండిరథంపై ఊరేగింపుగా అమ్మవారి పుట్టిల్లయిన వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు. వీరికి సిపి దంపతులు, పోలీసులు సాంప్రదాయ బద్ధంగా మేళతాళాలతో స్వాగతం పలికి అమ్మవారి రధాన్ని కొద్దిదూరం లాగారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టువస్త్రాలతో సారేను సమర్పించారు. ఈసందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో డిసిపిలు షరీన్‌బేగం, కె.జి.వి.సరిత, కె.కృష్ణప్రసన్న, ఏ.బి.టి.ఎస్.ఉదయరాణి, ఎస్.వి.డి.ప్రసాద్, ఏడిసిపి గుణ్ణం రామకృష్ణ, పశ్చిమ ఏసిపి ఎన్.వి.దుర్గారావు పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## దుర్గమ్మ ఆలయంలో వైభవంగా ఉగాది వేడుకలు
## - కనులపండువగా రథోత్సవం



**ఇంద్రకీలాద్రి, మార్చి 19, ప్రభాతవార్త :** ఇంద్రకీలాద్రిపై ఉగాది వేడుకలు వైభవంగా జరిగాయి. శ్రీపరాభవ నామ సంవత్సర ఆరంభ శుభోత్సవంతో పాటు వసంత వేడుకలనందించేలా వసంత నవరాత్రుల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సాయంత్రం శ్రీ గంగా పార్వతి (దుర్గ) సమేత మల్లేశ్వర స్వామివారి వెండి రథోత్సవం భక్తజన సందోహం నడుమ కన్నుల పండుగగా సాగింది. సాయంత్రం పంచాంగ శ్రవణం జరిగింది. దేవస్థానం,నూతన పూజా మండపం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆలయ ఆస్థాన సిద్ధాంతి చల్లా శ్రీనివాస శర్మ పంచాంగ పఠనం చేశారు.

నూతన సంవత్సరంలో ద్వాదశ రాశుల వారికి ఉండబోయే ఆదాయ వ్యయాలు, రాజపూజ్య అవమానాలు మరియు గ్రహ గతులను సిద్ధాంతి వివరించారు. భక్తులకు దేవస్థానం పంచాంగాలు ఉచితముగా పంపిణీ చేశారు. పంచాంగ శ్రవణం అనంతరం భక్తులకు ఉగాది పచ్చడి మరియు ప్రసాద వితరణ జరిగింది. రాబోయే ఖిశ్రీ పరాభవఖి నామ సంవత్సరంలో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు ఆలయ ఈవో శీనా నాయక్ తెలిపారు.దాతకు సత్కారందేవాలయంలో శివాలయం నిర్మాణం, యాగ శాల నిర్మాణం చేసిన దాత సంగా నరసింహారావు దంపతులను ఉగాది సందర్భంగా దేవస్థానం ఘనంగా సత్కరించింది.చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనా నాయక్, ధర్మకర్తలు సంగా దంపతులకు నూతన వస్త్రాలు అమ్మ వారి పటం, ప్రసాదములు అందజేశారు. పవిత్ర ఇంద్రకీల క్షేత్రం పై రెండు విశిష్ట నిర్మాణాలు చేయించిన దాత ఔదార్యంను కొనియాడారు.

- కనులపండువగా రథోత్సవం: లోకపావని కనకదుర్గమ్మ ఆలయంలో శ్రీ గంగా పార్వతి సమేత మల్లేశ్వర స్వామివార్లు వెండి రథంలో వేంచేసి భక్తులను కటాక్షించారు. శ్రీ గంగా పార్వతి (దుర్గ) సమేత మల్లేశ్వర స్వామివార్లను వెండి రథోత్సవం దర్శించుకున్న భక్తజన సందోహం జయజయ నాదాలను చేశారు. నగరవీధుల్లో రథం విహరిస్తున్న శ్రీ స్వామి అమ్మవార్లకు పెద్దఎత్తున భక్తులు మంగళహారతులు, పసుపు కుంకుమ, లతో స్వాగతం పలికారు. ముందుగా వెండి రథానికి ఆలయ ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, పాలకమండలి సభ్యులు కొబ్బరికాయ కొట్టి, ప్రత్యేక పూజలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు. వెండి రథం ముందుకు సాగుతుంటే.. ఇంద్రకీలాద్రి పరిసరాలు శివశక్తి నామస్మరణలతో, డప్పు కళాకారుల విన్యాసాలు హోరెత్తాయి. కోలాట బృందాల నృత్యాలు, భజన కళాకారుల భక్తి సంకీర్తనలతో, ఢం, డమరుక, ఢక్క, శంఖనాదాలతో అపరకైలాసంలా బెజవాడ నగరం విరాజిల్లింది. విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన వెండి రథంపై ఆది దంపతులు కొలువై భక్తులకు దర్శనమిచ్చారు. మహా మండపం నుండి ప్రారంభమైన ఈ వేడుక రథం సెంటర్, బ్రాహ్మణ వీధి, జమ్మిదొడ్డి మీదుగా కొత్తపేట వరకు సాగింది. దారిపొడవునా భక్తులు హారతులు ఇస్తూ స్వామి, అమ్మవార్లకు భక్తిపూర్వక నీరాజనాలు అర్పించారు. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ సాగిన ఈ రథోత్సవం వసంత నవరాత్రుల వైభవానికి నాంది పలికింది. చైత్ర మాసపు శుక్ల పక్ష పాడ్యమి నుండి ప్రారంభమయ్యే ఈ వసంత నవరాత్రులలో అమ్మవారికి విశేష పుష్ప అర్చనలు జరుగుతున్నాయి. లోక కల్యాణం కోసం, రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కోరుతూ ఈ తొమ్మిది రోజుల పాటు ఇంద్రకీలాద్రిపై వసంత నవరాత్రి ఉత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానాచార్య శివ ప్రసాద్ శర్మ, ధర్మకర్తలు జీవి నాగేశ్వరరావు, ఎం. కళావతి, ప్రత్యేక ఆహ్వానితులు వి. శంకర బాబు, అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్ రంగారావు పాల్గొన్నారు.



- దేవాలయాలు ధార్మిక కేంద్రాలుగా వర్థిల్లాలి: డా మాడుగుల [illegible] ఉగాది సందర్భంగా రాష్ట్రప్రభుత్వం నిర్వహించిన వేడుకల్లో పంచాంగ శ్రవణం చేసిన పద్మశ్రీ, డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ ఈరోజు సాయంత్రం శ్రీ కనకదుర్గమ్మ వారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో వీకే శీనానాయక్, ప్రోటోకాల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ కొచ్చెర్ల గంగాధర్, నాగఫణిశర్మ వారిని ఆలయమర్యాదలతో స్వాగతించారు. అమ్మవారి దర్శనం అనంతరం వేద పండితులు వేద ఆశీస్సులు అందజేశారు. అమ్మవారి చిత్రం, వస్త్రాలు ప్రసాదములను ఈవో అందజేశారు. ఈ పరాభవ నామ సంవత్సరంలో రాష్ట్ర ప్రజలందరికి శ్రీ కనకదుర్గ అమ్మవారి కటాక్షం సమృద్ధిగా లభిస్తుందని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని, దేవాలయాలు ధార్మిక కేంద్రాలుగా విరాజిల్లుతాయని మాడుగుల నాగఫణి శర్మ పేర్కొన్నారు.

## టిడిపి కేంద్ర కార్యాలయంలో వైభవంగా ఉగాది వేడుకలు

**విజయవాడ,మార్చి 19,ప్రభాతవార్త ప్రతినిధి:** తెలుగువారి నూతన సంవత్సరం పరాభవనామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఒకరికొకరు ఉగాది శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వేడుకల్లో భాగంగా నిర్వహించిన పంచాంగ శ్రవణం అందరినీ ఆకట్టుకుంది. ..ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ కేంద్ర కార్యాలయ కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ బుచ్చి రాంప్రసాద్, ఏపీ బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్, ఏపీ కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఛైర్మన్ ఎస్. రాజశేఖర్, ఏపీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, ఏపీ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామకృష్ణంరాజు, శ్రీశైలం ఆలయ కమిటి సభ్యులు ఏవీ రమణ, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి, నాలెడ్జ్ సెంటర్ ఛైర్మన్ గురజాల మాల్యాద్రి, మీడియా కోఆర్డినేటర్ ధారపనేని నరేంద్రబాబు, నేతలు పర్చూరి కృష్ణ, శనక్కాయల రాజకుమారి, గంటా గౌతమ్ తదితరులు పాల్గొన్నారు... ఈ సందర్భంగా ..టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య.. మాట్లాడుతూ.. గత పాలకుల నీడ నుంచి రాష్ట్రం బయటపడిందని, ఇకపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి ఆధ్వర్యంలో ఎక్కడా కల్తీ లేని, పారదర్శకమైన పాలన ప్రజలకు అందుతుందన్నారు. ఒకనాడు దేవతల రాజధానిగా విరాజిల్లిన అమరావతి, మళ్ళీ మన కళ్లముందే అద్భుతమైన రాజధానిగా సాకారం కాబోతోందని ఆయన పేర్కొన్నారు. అమరావతి నిర్మాణం రాష్ట్ర అభివృద్ధికి వెన్నెముక అని కొనియాడారు. అమరావతి నిర్మాణానికి నాందిగా పొట్టి శ్రీరాములు గారి విగ్రహావిష్కరణ జరగడం శుభపరిణామమని, ఇది తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక అని తెలిపారు. పంచాంగ శ్రవణంలో సిద్ధాంతి గారు చెప్పిన విషయాలు వాస్తవానికి అత్యంత దగ్గరగా ఉన్నాయని అభినందించారు. భవిష్యత్తులోనూ చంద్రబాబు నాయుడు గారి నాయకత్వమే రాష్ట్రానికి శ్రీరామరక్ష అని, ఇదే ప్రభుత్వం మళ్ళీ మళ్ళీ అధికారంలోకి వస్తుందని సిద్ధాంతి గారు నిగూఢంగా చెప్పారని విశ్లేషించారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు గారి నాయకత్వం ఎంత పటిష్టంగా ఉందంటే.. భవిష్యత్తులో ప్రత్యర్థులకు ఇక్కడ స్థానమే ఉండదని సిద్ధాంతి గారు స్పష్టం చేశారని, ప్రజల మద్దతు కూడా అదే దిశగా ఉందని ఆయన పేర్కొన్నారు. అనంతరం ..టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు.. మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలందరికి పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. సిద్ధాంతి మాచిరాజు వేణుస్వామి గారు చెప్పిన పంచాంగ శ్రవణం విన్నాక రాష్ట్ర భవిష్యత్తుపై మరింత నమ్మకం కలిగిందని ఆయన పేర్కొన్నారు. సిద్ధాంతి గారు చెప్పినట్లుగానే ఈ ఏడాది రాష్ట్రం అన్ని విధాలా బాగుంటుందని, సిరిసంపదలతో వర్ధిల్లుతుందని నమ్ముతున్నాను. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ ఈ ఉగాది శుభాలను చేకూర్చాలని కోరుకుంటున్నాను. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి పాలనలో ప్రజలందరూ సంతోషంగా ఉండాలి. మనమంతా కలిసి ఖిస్వర్ణాంధ్రప్రదేశ్‌ఖి లక్ష్యాలను చేరుకునేలా అడుగులు వేయాలి. భగవంతుడి ఆశీస్సులు మన రాష్ట్రంపై ఎప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. మన యువనేత, భవిష్యత్ నాయకులు నారా లోకేశ్ బాబు గారు విద్యాశాఖ వంటి అత్యంత కీలకమైన బాధ్యతను తీసుకున్నారు. భవిష్యత్ తరాల తలరాతను మార్చే ఈ శాఖను నిర్వహించడం సవాలుతో కూడుకున్న పని అయినప్పటికీ ఆయన ఎంతో సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తున్నారు. లోకేశ్ గారు ఆశించిన విధంగా విద్యావ్యవస్థ అభివృద్ధి చెందాలని, ఆయన నాయకత్వంలో మనమంతా ముందుకు సాగాలని ఆకాంకిస్తున్నాను. సీఎం చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో పయనించాలని కోరారు. ..ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్.. మాట్లాడుతూ..ఈ ఉగాది వేడుకలకు విచ్చేసిన సిద్ధాంతి మాచిరాజు వేణుగోపాల్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు. ఆయన ఇక్కడ పంచాంగ శ్రవణం చేయడం ఇది మూడోసారి కావడం విశేషం. 2024 ఎన్నికల సమయంలో సిద్ధాంతి గారు చెప్పిన మాటలు అక్షర సత్యాలయ్యాయి. తెలుగుదేశం పార్టీ 135 సీట్లతో ఘన విజయం సాధిస్తుందని ఆయన అప్పుడే చెప్పారు.. ఆయన అన్నట్లుగానే కూటమి ప్రభుత్వం భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చింది. ఈ పవిత్రమైన ఉగాది పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ఈ కొత్త ఏడాది అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు. సిద్ధాంతి గారి ప్రవచనం ప్రకారం రాబోయే కాలంలో కూడా రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం వాస్తవాలను కళ్లకు కట్టినట్లు వివరించిన సిద్ధాంతి గారిని నేతలు ఘనంగా సత్కరించారు.

## నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాకే స్టీల్‌ప్లాంట్‌కు
### భూమిపూజ చేయాలి: సిపిఐ

**విజయవాడ,మార్చి 19.ప్రభాతవార్తనిధి:** నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించకుండా ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్‌కు ఈ నెల 23న భూమి పూజ చేయడానికి ఏర్పాట్లు చేయడం సరికాదని దీనిని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ కార్యదర్శి వి.శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు. ఈ అంశాన్ని తమ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదన్నారు. వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాజెక్టులో భాగంగా నక్కపల్లి మండలంలో రాజయ్యపేట, బుచ్చిరాజుపేట, చందనాడ, అమలాపురం, డిఎల్.పురం ఐదు పంచాయతీల పరిధిలో 11 గ్రామాల నుండి 5,500 ఎకరాల భూమి రైతుల నుండి జిరాయితీ భూమికి ఎకరాకు 18 లక్షలు, డి.ఫారం భూమికి 12 లక్షల 50 వేలు ఇచ్చి బలవంతంగా ప్రభుత్వం సేకరించింది. అందులో 2,100 ఎకరాల భూమిని ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వం కేటాయించింది. దీనికి అర్సెల్ మిట్టల్ కంపెనీ ఎకరాకి 53 లక్షల రూపాయలు ప్రభుత్వానికి చెల్లించింది. రైతుల భూములతో వ్యాపారం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం నిర్వాసితులకు అన్యాయం చేస్తోంది. నిర్వాసితులైన రైతులు, కూలీలు, వృత్తిదారులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ఇవ్వాల్సిన నష్టపరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలు ఇప్పటివరకు పూర్తిగా అమలు చేయలేదు. నిర్వాసిత కాలనీలో ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా ఇళ్ళ నిర్మాణం జరగకుండా ఆగమేఘాలమీద ప్రస్తుతం నివశిస్తున్న ఇళ్ళు నేలమట్టం చేసి నిర్వాసితులను నడిరోడ్డుపై నెట్టివేశారు. జిరాయితీ భూములకు ఇచ్చిన నష్టపరిహారంతో సమానంగా డిఫారం సాగు భూములకు కూడా చెల్లించాలి. వివాహమైన ఆడపిల్లలకు, 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ, యువకులకు భూసేకరణ సందర్భంలో ఇచ్చిన హామీ ప్రకారం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, ఇంటి స్థలం ఇవ్వాలి. ప్రస్తుతం ఇచ్చిన ఆరఅండఆర్ ప్యాకేజీ రూ.8,98,000 అంగీకారం కాదని, పెరిగిన ఇంటి నిర్మాణ సామాగ్రి ధరలకు అనుగుణంగా రూ.25 లక్షల ప్యాకేజీ పెంచి ఇవ్వాలి. నిర్వాసితుల కాలనీలో విద్యా, వైద్యం, విద్యుత్, నీటి సౌకర్యంతో పాటు 25 రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలి. భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఆ ప్రాంతంలోనే ఉపాధి పనులు కల్పించాలి. సమస్యలను పరిష్కరించకుండా, నిర్వాసితుల హక్కులను అమలు చేయకుండా ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంటు భూమి పూజ నిర్వహించడం అన్యాయం, చట్టవిరుద్ధం. ఇప్పటికైనా భూమి పూజ వాయిదా వేయాలని, నిర్వాసితులకు న్యాయం చేయాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ కోరుతున్నది.

## ప్రకృతితో ముడిపడిన పండుగ ఉగాది: ఎంపి పురందేశ్వరి

**రాజమహేంద్రవరం,మార్చి19,ప్రభాతవార్త ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి:** ప్రకృతితో ముడిపడిన పండుగ ఉగాది అని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. కాలం ఒక ప్రవాహం లాంటిది, గడిచిన, రాబోయే కాలం ఎలా ఉండబోతుంది అన్నది ఉగాది పంచాంగం అందిస్తుందన్నారు. తెలుగు క్యాలెండర్ మారడమే కాకుండా ప్రకృతి పురి విప్పి నాట్యమాడుతూ, కొత్త చిగురుతో ఆహ్వానం పలికేది ఉగాది అని ఆమె పేర్కొన్నారు. శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పురస్కార మహోత్సవం రాజమండ్రి జెకె గార్డెన్స్ లో ఎంపీ పురందేశ్వరి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరిగింది. ఆత్మీయ వాతావరణంలో సందడిగా సాగిన ఈ వేడుకలో కవిపండితులకు, కళాకారులకు సత్కారం చేసారు. ఈసందర్భంగా ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ అందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కొత్త సంవత్సరం అందరికీ సుఖ సంతోషాలు కలిగించాలని ఆకాంక్షి ంచారు. పరాభవ నామ సంవత్సరం అంటే ఓటమి అనే భావనతో చాలా మంది ఆందోళన చెందుతారని, అయితే [illegible] పరాభవంగా, మంచికి వి జ య [illegible] భావించాలన్నది నిగూడ అర్ధం అని ఆమె విశ్లేషించారు. ఉగాది పచ్చడి అంటే షడ్రుచుల సమ్మేళనమని ఎంపీ పురందేశ్వరి తెలిపారు. చేదు స్వీకరిస్తేనే, వెంటనే తీపి వస్తుందని గుర్తించాలని అన్నారు. పంచాంగం మన జీవన శైలిలో అంతర్భాగమని, రాశుల గమనంతో పాటు మన గమనం ఎలా ఉండబోతుంది అన్నది పంచాంగ శ్రవణం ద్వారా తెలుసుకుని తద్వారా నడుచుకోవడానికి వీలవుతుందని ఎంపీ పురందేశ్వరి అన్నారు. తొలుత విజయశంకర ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల ప్రిన్సిపల్ పసుమర్తి శ్రీనివాస శర్మ శిష్యబృందం నృత్య ప్రదర్శనతో అలరించారు.



జ్యోతి ప్రజ్వలన అనంతరం పుల్లెల సత్య నారాయణ పంచాంగ శ్రవణం చేసారు. ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మద్దిపాటి వెంకట్రాజు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, జిల్లా బిజెపి అధ్యక్షుడు పీక్కి నాగేంద్ర, బత్తుల వెంకట లక్షి ్మ, ఒలేటి సత్యనారాయణ, మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ.

## మైనర్‌పై అత్యాచారం - నిందితుడు అరెస్టు.. పోక్సో కేసు నమోదు

**అనకాపల్లి రూరల్ మార్చి 19 ;(ప్రభాత వార్త)** ఒక చిన్నారిపై అత్యాచారానికి వడిగట్టిన ఒక వ్యక్తిని అనకాపల్లి రూరల్ పోలీసులు అదుపులో తీసుకొని అరెస్టు చేసినట్లుగా డిఎస్పి ఎం శ్రావణి తెలిపారు. ఇందుకు సంబంధించి వివరాలను గురువారం విలేకరులకు తెలియజేశారు. ఈ సంఘటనపై రూరల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన ఒక మహిళ తన కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 18న కొత్త అమావాస్య పండగ సందర్భంగా అనకాపల్లి మండలంలో ఒక గ్రామానికి వచ్చారు. అదే రోజు సాయంత్రం, ఆమె కుమార్తెలు, ఆమెకు వరుసకు మేనకోడలు అయిన పాప మొత్తం ముగ్గురు పిల్లలు కలిసి తన చిన్న అత్త ఇంటికి భోజనం కోసం వెళ్లారు. సుమారు సాయంత్రం 7:00 గంటల సమయంలో సదరు ముగ్గురు పిల్లలు, పిర్యాది చిన్న అత్త ఇంటి ముందు అడుకొను చుండగా, ముద్దాయి అయిన సీతిని రాజు, పిర్యాది కుమార్తె వద్దకు వచ్చి, మేడ మీదకు వస్తే, స్టేజ్ మీద జరిగే ప్రోగ్రామ్ బాగా చూపిస్తాను, రమ్మని పిలవగా, అంతట ఆ పాప అతని వెంట డాబా మీదకు వెలుచుండగా, సదరు రాజు పాపని డాబా మెట్లు ప్లాట్ ఫామ్ వద్దకు తీసుకొని వెళ్ళి ఆమె పై అత్యాచారం చేశాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే కొడతానని బెదిరించాడు. తరువాత భాదితురాలు డాబా మీద నుంచి క్రిందికి వచ్చి జరిగిన విషయం తన తల్లికి మిగతా బందువులకు చెప్పగా, వారు పాపను తనికీ చేసి సదరు సీతిని రాజు పాప పై అత్యాచారం చేసినట్లు నిర్ధారించుకున్నారు. అంతట ఏమి జరిగిందని సదరు పాపని అడుగగా ఆమె జరిగిన విషయం తెలిపింది. పాపను ఆమె తల్లి , బంధువులు అడుగుతున్న సమయంలో ముద్దాయి మేడ పై నుండి దిగి పారిపోయినాడు. ఈ మేరకు మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై రూరల్ సబ్ ఇన్స్పెక్టర్ జి రవికుమార్ కేసు నమోదు చేసి నిందితుని పట్టుకోవడానికి గాలింపు చర్యలు చేపట్టారు. డి.ఎస్.పి ఎం శ్రావణి ఆదేశాల మేరకు సబ్ ఇన్స్పెక్టర్ జి రవికుమార్ తమ సిబ్బందితో నిందితుడు ఆచూకీ కోసం గాలించి నేరము జరిగిన కొద్ది గంటల లోనే శ్రావణి అరెస్టు చేశారు.

## రచ్చ బండను ఢీకొన్న బైకు ఇద్దరు యువకులు మృతి

**చేజర్ల (నెల్లూరు), మార్చి 19, ప్రభాతవార్త :** ఉగాది అంటే కొత్త ఆశాలు.. కొత్త ప్రారంభాలు... ఆనందాలు గుర్తుకొస్తాయి.... కాని చేజర్ల మండలం చిత్తలూరు గ్రామంలో గురువారం ఉగాది పండుగ దుఃఖాన్ని మిగిల్చింది. గతరాత్రి రచ్చబండను ఢీకున్న మోటార్ బైకు ప్రమాదంలో ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోవడంతో గ్రామం మొత్తాన్ని విషాదం ఆవరించింది. పొదలకూరు నుండి స్వగ్రామం అయిన చిత్తలూరుకి వెళుతున్న సిద్ది హరీష్ (29), సిద్ది మురళీ (27)లు బైకుపై ప్రయాణిస్తుండగా ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. ఇంటికి చేరి కుటుంబసభ్యులతో పండుగా జరుపుకోవాలని ఆశగా బయలు దేరిని వారు తమ ఇండ్లకు చేరే కొన్నే క్షణాల ముందు ప్రమాదంలో మృతి చెందడం తీవ్ర విషాదంలో ముంచింది.

